# "పల్లెటూరు" కి
# కొత్త ముందుమాట

(ఇది 6వ ముద్రణకు రాసినది)

---

ఈ కథలో కొన్ని విషయాల గురించి:

★ ఇందిర తల్లి కృష్ణమోహన్‌ని "మా అమ్మాయిని జాగ్రత్తగా తీసుకు వెళ్తావా" అని అడిగినప్పుడు, కృష్ణమోహన్— "మీ అమ్మాయి నా వెనకే నడిచి వొస్తే జాగ్రత్తగానే తీసుకు వెళ్తాను!" అన్నాడు. ఈ మాటలు అతను కొంచెం హాస్యానికి అన్నవే. అయినా అందులో సమాజ స్వభావం వుంది. స్త్రీ, పురుషుడి వెనకాల నడిస్తేనే, అతన్ని అనుసరించి అతని చెప్పుచేతల్లో వుంటేనే, ఆమెకు భద్రత. అప్పుడే స్త్రీని రక్షించ గలుగుతాడు పురుషుడు. కృష్ణమోహన్ అన్న ఆ నాలుగు మాటల్లో ఎంత సహజ ప్రభావమో!

అతను అలా అనడానికి బదులు—"జాగ్రత్తగా నేను తీసుకెళ్ళడం ఏమిటి? తన జాగ్రత్త తనకు తెలీదా? అవసరమైనప్పుడు నేను తప్పకుండా సహాయం చేస్తాను" అంటే అతని స్వభావం ఎంతో అభ్యుదయకరంగా వుండేది! కానీ అలా అనలేదు. అలా అనకపోవడంలో తప్పు వుందనే సంగతి కూడా అతనికి తెలీదు.

"మీ అమ్మాయి నా వెనకే నడిచివొస్తే జాగ్రత్తగానే తీసుకువెళ్తాను" అనడంలో "మీ అమ్మాయిని రక్షించే పూచీ నాదీ. కానీ, మీ అమ్మాయి మాత్రం నా దగ్గిర వినయంగా వుండాలి. అలా అయితేనే నేను రక్షించ గలను" అని, స్త్రీని రక్షించే బాధ్యత తనమీద వేసుకుంటున్నట్టే. తన మాటల్లో పురుషుణ్ణి అధికుణ్ణి చేసి, స్త్రీని అవమానపరిచే లక్షణం వుందనే సంగతి కృష్ణమోహన్‌కి తెలీదు. అతని మాటలు ఏమీ ఆధారం లేకుండా

వొచ్చినవి కావు. ఆ మాటలు సమాజ స్వభావాన్ని వ్యక్తీకరిస్తు-న్నాయి.

★ "ఆడవాళ్ళు అలిగితేనే అందం." అం ాడు కృష్ణమోహన్ ఇందిరతో వొకసారి. పూర్వంనించీ ఆడవాళ్ళ అలికల మీదా, ఏడుపుల మీదా ఎంతెంత కవిత్వాలో!

ఆడవాళ్ళకు దేని విషయంలోనైనా హక్కుగా సాధించుకునే అవకాశాలు లేకపోవడం చేతనే అలుగుతారు, ఏడుస్తారు.

ఎవరైనా వొక విషయంలో అలిగారంటే అర్థం అలగడంకన్నా చెయ్యగలిగేదేమీ లేకనే. అలగడం తప్ప, యాడవడంతప్ప, ఆడవాళ్ళకేం హక్కులేడిశాయి? అందుకే అలుగుతారు. ఏడుస్తారు. అలగడంగాక, యాడవడంగాక, ఇంకేదైనా చెయ్యడానికి వీలుంటే అలుగుతారా? ఏడుస్తారా? ఏమీ చెయ్యలేని "నిస్సహాయత్వం" లోంచే అలిగే స్వభావం, ఏడ్చే స్వభావం వొచ్చాయి స్త్రీలకు.

సమాజం, స్త్రీతో, "అలగడం, యాడవడం, అశక్తత లక్షణాలు. ఆ రకం ఆత్మావమానం విడిచిపెట్టు. నీకు ఏ విషయంలో ఎందుకు కష్టం కలుగుతుందో ఆ పరిస్థితిని ధిక్కరించు. వ్యతిరేకించు. దానిపట్ల అసహ్యంతో దాన్ని మార్చుకో. నీకు కావలసిందేమిటో నీ హక్కుగా సంపాదించుకో" అని చెప్పదు. "నీకు అయిష్టమైన పరిస్థితులు ఎదురైతే అలక వహించు. నీకు కష్టం కలిగించే విషయాలు సంభవిస్తే కన్నీళ్ళు పెట్టుకో. నీ కన్నీళ్ళు చూస్తే పురుషుడికి తప్పకుండా దయ కలుగుతుంది. సమాజం తప్పకుండా జాలిపడుతుంది. అంతకన్నా నీకేం కావాలి? అసలు అలిగినప్పుడూ, ఏడ్చేటప్పుడూ నువ్వు ఎంతో అందంగా ఉంటావు. పురుషుడికి అందంగా కనపడడం కోసమైనా నువ్వు ఏడుస్తూ వుండవొచ్చునే?" అని బోధిస్తుంది.

స్త్రీలు, ప్రతీ అశాంతికీ, ప్రతీ సమస్యకీ అలగడం, యాడవడం మాత్రమే ముఖ్య స్వభావంగా చేసుకుంటారు. అలగడం అంటే "మౌనంగా ప్రార్థించడమే." ఎదటివాళ్ళు దయదలిస్తేనే అలిగినవాళ్ళ అలక తీరుతుంది. అంతేగానీ, అలిగినవాళ్ళు, కోపంతో తమ హక్కుగా చెయ్యగలిగేదేమీ వుండదు. భర్తల దయ కోసమే భార్యలు అలుగుతారు. (ఇది కోపంకాదు). వొక భార్య, భర్త మీద అలిగిందంటే అర్థం—

"ఇంతకన్నా నాకేమీ హక్కులేదు. నీ దయ. నీ కిష్టమైతేనే నాకు సంతోషం కలిగేట్టు చెయ్యి." అని చెప్పడమే.

"స్త్రీలు అలిగితేనే అందం" అనే పురుషుడికి, ఆ "అలిగిన స్త్రీ" ఎందుకో బాధపడుతోందని తెలుసు. ఆ బాధని ఆమె తీవ్రంగా వ్యతిరేకించి వొదిలించుకోకూడదు. చేతకాని స్థితిలో, నిస్సహాయత్వంలో, ఎవరో దగ్గిర పురుషుడి మీద ఎక్కువ విశ్వాసం పెట్టుకుని, అతను తన బాధని తీర్చాలని ప్రార్థించి, తీర్చనందుకు కొంచెం వ్యతిరేకత చూపిస్తూ అలగాలి.

ఒక స్త్రీతో ఆమెకు సంబంధించిన పురుషుడు, "నువ్వు అలిగితే చాలా అందంగా వుంటావు" అన్నాడంటే అర్థం— "నువ్వు నా విషయంలో ఏదో నచ్చక బాధపడుతున్నావని నాకు తెలుసు. ఆ బాధ పోగొట్టుకోడానికి నీకు మార్గంవుంది నీ బాధ పోగొట్టటానికి నాకూ మార్గం వుంది. కానీ నేను పోగొట్టను. ఆ బాధ అలాగే వుండనియ్యి. ఆ బాధ పోగొట్టుకొని సుఖంగా వుండాలని ప్రయత్నించకు. నువ్వు అంత స్వతంత్రంగా ప్రయత్నిస్తే నాకేమీ నచ్చదు. నీ కిష్టంలేని పరిస్థితి మార్చుకోవాలని నీకై నువ్వేమీ ప్రయత్నించకు. అంతా నా దయమీదే ఆధారపడి, కొంచెం అయిష్టం మాత్రం ప్రదర్శించావంటే, నా మీద కొంచెం అలక మాత్రం చూపావంటే, నా కెంతో సంతోషంగా వుంటుంది. ఆ అలకలో నువ్వెంతో అందంగా కనపడతావు. ఏడిస్తే మరీ అందా లీనుతావు.నీఇబ్బందులన్నీ నువ్వేస్వతంత్రంగా పరిష్కరించుకో గలిగే స్థితిలో, నా మీద ఆధార పడకుండా, నా మీద అలగకుండా వుంటావనుకో, అప్పుడు నీ కసలు అందం ఎక్కడిదీ?" అని చెప్పడం అన్నమాట.

అలిగి, రుసరుసలాడుతూ, ముక్కూ, మూతీ చిట్లిస్తూ, కళ్ళ నీళ్ళు బొట బొట కారుస్తూ అశాంతితో బాధపడుతూవున్న స్త్రీలో అందం చూడగలిగే పురుషుడు ఎంత మూర్ఖుడో! ఎంత కిరాతకుడో!

★ ఇంకో దరిద్రగొట్టు విషయం చూడండి!

కాలేజీలో చదువుతున్న ఇందిర, పల్లెటూరు తులసితో, "నీకు చాలా డబ్బుంది కాబట్టి మువ్వల వడ్డాణం, రవ్వల అరవంకీ, పాపుకాసుల పేరూ, చక్కటి నెక్లెస్‌లూ అన్నీ చేయించుకో" అని సలహా ఇస్తుంది. (అందెలూ? బేడీలూ?)

ఇందిర మాటలకు తులసి ఆశ్చర్యపోయి, "నిజంగా అంటున్నావా?

వేసుకోకేమా?" అంది. చదువుకున్న అమ్మాయికి నగల మీద అంత సదభి ప్రాయం వుండకూడదనీ, అలాంటి మార్పు చదువు కలిగిస్తుందనీ తులసి అభిప్రాయం.

కానీ, ఏ మార్పూ ఎరగని ఇందిర, "నాకు నగలంటే చాలా ఇష్టం....నగలు వుండడం ఆడదానికి పెద్ద అండకూడా" అంటుంది.

నగలు అండ అనే తర్కం, స్త్రీలకు గొప్ప సత్యంగా కనపడు తుంది.

పురుషుడికి ఇతర ఆస్తి విధానాలెన్నో వుండగా, స్త్రీకి నగలు మాత్రమే అండ అయ్యే పరిస్థితి ఎందుకు వుండాలి?

గాజుల్నీ, ముక్కు పుడకల్నీ, జడ గంటల్నీ, చూసుకుని స్త్రీలు ధైర్యంగా వుండాలన్నమాట. "నా సమస్తమయిన కష్ట సుఖాలూ నా భర్త చూస్తాడు" అనే నమ్మకం లేకే, "నాకు బంగారం వుంది. నాకు అదే అండగా వుంటుంది."—అనే ధైర్యంతో బ్రతకడం అన్నమాట. భర్త మీద గాక జడగంటలమీదో, ముక్కు పుడకలమీదో, ధైర్యం పెట్టుకోవాలన్న మాట. భర్త పోషణలో, భర్త రక్షణలో వుంటూనే వీలయినంతవరకూ తనదీ అనుకునే ఆర్థిక బలం ప్రత్యేకంగా వుంచుకోవలసిందే నన్నమాట. లేకపోతే ఆ భర్త ఎంత హీనపరుస్తాడో, ఎంత చిన్నబరుస్తాడోనని భయం. (భర్త వొక్కడే వ్యక్తిగతంగా చేస్తాడని కాదు. అత్తవారి రూపంలో వున్న పరిస్థితు లన్నిటికీ ప్రతినిధి భర్త). ఆ నగల అండలేకపోతే, భర్తనే నమ్ము కుంటే ఎప్పుడు గంగలో ముంచుతాడోనని భయమే.

ఏ నగలూ లేని స్త్రీలు (భర్తల పోషణలో వున్నప్పటికీ) నిరా ధారులే కదా? "నగలు స్త్రీలకు పెద్ద అండ" అనుకునే స్త్రీలు, "పురుషు డికి సమాజంలో వేరే రక్షణలూ, వేరే ఆస్తి విధానాలూ వున్నప్పుడు, స్త్రీలకు ఈ నగల్ని నమ్ముకునీ, వీటిని అండగా చేసుకునీ, వీటి ధైర్యంతో జీవించవలసిన అగత్యం ఏమిటి? ఎందుచేత?" అని కూడా ఆలోచించ గలగాలి.

నగలవల్ల శరీరాలకు అందం వొస్తుంది అనుకోవటం,ఆ అందంతో భర్తల్ని ఆకర్షించగలం అనుకోవటం, ఇలాంటి పరిస్థితులతో జీవితాలు గడపవలసి రావడం—స్త్రీల అధోగతికి చిహ్నమే.

ప్రతీవొక్క విషయానికీ స్త్రీ-పురుషుల జీవిత విధానాల మధ్య

ఎన్ని తేడాలో! ఎంత వైరుధ్యమో!

నగలు పెట్టుకునే విషయం గురించి చదువుకోని తులసి అభిప్రాయాలకీ, చదువుకున్న ఇందిర అభిప్రాయాలకీ ఏమీ తేడా లేదు. చదువుకున్నందువల్ల ఇందిరకు వొచ్చిన ప్రత్యేక జ్ఞానం ఏమిటి? ఏమీలేదు. ఈ చదువులు సమాజ పరిస్థితుల్ని పరిశీలించడానికీ, విమర్శించడానికీ ఏమీ పనికిరావు. అందుకే ఇందిరకూడా తులసి స్థాయిలోనే వుంది.

★ పట్నంలో పెరిగిన ఇందిరకు పల్లెటూరు మనుషులమీద చాలా దురభిప్రాయాలున్నాయి "పల్లెటూళ్ళ ఆడవాళ్ళు అసభ్యంగా, మోటుగా ప్రవర్తిస్తారేమోనని భయపడింది ఇందిర."

అలాగే తులసికి బస్తీ పిల్ల అయిన ఇందిర గురించి, "అసలు ఇందిర తనతో మాట్లాడుతుందా?" అని సందేహం. "మామయ్యతో సమానంగా పెద్దచదువులు చదువుకునే బస్తీ పిల్ల తనతో అంత సన్నిహితంగా మెలగటం తులసికి చాలా గర్వంగా, సంతోషంగా వుంది."

పట్నవాసులు పల్లెటూరి మనుషుల్నిగురించి చాలా 'అనాగరికులనీ' 'మోటు మనుషులనీ' 'మూర్ఖులనీ'-తామే గొప్ప నాగరికులమనీ, వున్నతులమనీ, సున్నిత హృదయులమనీ అనుకుంటారు.

పల్లెటూరు మనుషులుకూడాపట్నవాసుల్నే గొప్పగా భావించి, తమని కించపరచుకుంటారు. అంతేగాక, పట్నవాసులు తమలాగా నిర్మలంగా ప్రవర్తించలేరనీ, స్వార్ధ పరులనీ మోసగాళ్ళనీ కూడా అభిప్రాయపడతారు.

పట్న వాసులికి పల్లెటూళ్ళ ప్రజలంటే చాలా చిన్న చూపు.

పల్లెటూళ్ళ ప్రజలకు పట్నాల్లో ప్రజలంటే కొంత మోజూ, కొంత జంకూ.

గ్రామస్తులకూ, పట్నవాసులకూ మధ్య వుండే ఈ "దూరమే" తులసి ఆలోచనల్లోనూ, ఇందిర ఆలోచనల్లోనూ ప్రతిఫలించింది.

గ్రామాలకూ, పట్టణాలకూ మధ్య వున్న "దూరం" రోడ్ల దూరం కాదు.

జీవిత విధానాల దూరం. ప్రజల దృక్పధాల దూరం.

గ్రామాల జీవితంతో పట్టణాల ప్రజలకు సంబంధం లేకుండా, పట్టణాల జీవితంతో గ్రామ ప్రజలకు సంబంధం లేకుండా, వొకరి జీవిత విధానం గురించి ఒకరికి ఏమీ తెలీకుండా వున్నంతకాలం ఈ "దూరాలూ"

"ఆటోహలూ" "హెచ్చు తగ్గులూ" తప్పవు.

పాత సంస్కృతిని మార్చుకుని, కొత్త సంస్కృతిని నిర్మించుకునే విధానంలో- గ్రామ జీవితానికీ, పట్టణ జీవితానికీ మధ్య "దూరం" లేకుండా చేసుకోవాలి.

గ్రామ ప్రజలకు పట్టణ జీవితంతోనూ, పట్టణ ప్రజలకు గ్రామ జీవితంతోనూ అనుభవాలివ్వగలిగే సంబంధా లేర్పడాలి. అందరి జీవిత విధానమూ వొకటిగానే రూపొందాలి. నిత్య జీవితంలోనూ, సంస్కృతి లోనూ ఈ మార్పు జరిగేవరకూ పట్టణాల ప్రజలకు గ్రామాలంటే చులకన భావమూ, గ్రామ ప్రజలకు పట్టణాలంటే భయ భక్తులూ పోవు.

★ ఇందిరని చూడాలని వొచ్చిన కొందరు స్త్రీలు ఇందిరని చక్కని ప్రశ్నలు అడుగుతారు.

—"చదువుకున్న తర్వాత ఉద్యోగం చేస్తావా?" (చదువుల వల్ల లాభం ఉద్యోగాలు చెయ్యడం అన్నదే వారికి తెలుసు కాబట్టి.)

—"పెళ్ళి చేసుకునే దానికి పెద్ద చదువు లెందుకూ?" (కూడు వొండే భాగ్యానికి అంతంత చదువు లెందుకూ?)

ఇలాంటి ప్రశ్నల్లో మూర్ఖత్వం ఏమీ లేదు. పైగా చాలా సహజంగా పుట్టుకొచ్చిన ప్రశ్నలు అవి.

ఆ ప్రశ్నలన్నీ తెలివి తక్కువ వాగుడుగానూ, అవి అడిగిన వాళ్ళు "అమ్మలక్కల్లాగా"నూ కనపడ్డారు ఇందిరకి.

ఇందిరకి ఆ ప్రశ్నలవల్ల కొంత ఆలోచన కలిగి, "అవును. ఈ చదువుల లక్ష్యం ఏమిటి? భవిష్యత్తులో నేను ఏం చెయ్యబోతున్నాను? భర్తకి వంటచేసి పెట్టడం మాత్రమేనా నా కర్తవ్యం?" అని ఇందిర కొంచెం తర్కించుకుంటే బాగుండేది. కానీ, అసలు ఇందిర ఆ "అమ్మ లక్కల" మీద చులకన భావంతో వారి మాటలమీద దృష్టే వుంచలేదు.

"పల్లెటూళ్ళలో ఏం చూస్తావూ? ఏం చూద్దామని వొచ్చావూ?" అని వొకావిడ అడిగింది.

ఇందిర నసుగుతూ—"పంట పొలాలూ....పళ్ళతోటలూ...." అని వూరుకుంది.

పల్లెటూళ్ళు చూడడం అంటే, చెట్లూ, చేమలూ, గట్లూ, పుట్టలూ చూడ్డమే అనుకుంటాం. గాలిలో వూగే పొలాలూ, పళ్ళతోవొంగే తోటలూ

పూలతో నిండే చెరువులూ, చంద్రుడూ, వెన్నెలా— ఇవి చూస్తే చాలు పల్లెటూళ్ళు చూసినట్టే.

చెట్లూ, పుట్టలేనా పల్లెటూళ్ళంటే? మనుషులు లేరా? ఆ మనుషులకు కష్టసుఖాలు లేవా? పంటపొలాలూ, పళ్ళ తోటలూ చూసి, ఆ పంటలు పండించే మనుషుల జీవితాలు కూడా చూడవలసిన అవసరం లేదా?

"పల్లెటూళ్ళలో ఏం చూస్తావు?" అని ఇందిరని అడిగినప్పుడు ఇందిర— "పంటపొలాలూ, పళ్ళ తోటలూ...." అని మాత్రమే చెప్పి వూరుకోకుండా, "ఇక్కడ నివసించే వారిని చూద్దామని ఇక్కడ జీవిత పరిస్థితులు తెలుసుకుందామని వొచ్చాను" అని కూడా అనగలిగేంత జ్ఞానం వుంటే ఎంత బాగుండేది!

పల్లెటూళ్ళు చూసినా, పట్టణాలు చూసినా కేవలం అక్కడ వున్న చెట్లూ చేమలూ, రాళ్ళూ రప్పలూ, కట్టడాలూ, ఫ్యాక్టరీలూ మాత్రమే చూడడం కాదు. వాటికి కారణభూతమైన మానవ జీవితాల్ని, అందులో మంచి చెడ్డల్ని, కష్టసుఖాల్ని చూడాలి. చూడాలనే దృక్పథం వుండాలి.

దిగుడు బావులుచూసి, వుయ్యాల లూగి, చెరువులో స్నానాలుచేస్తే, పల్లెటూళ్ళు చూసినట్టు కాదు.

కృష్ణమోహన్ సిరిసంపదలు చూసీ, తులసి నగలు చూసీ, వొక ధనవంతుల కుటుంబంలో పేరంటం చూస్తే, పల్లెటూళ్ళు చూసినట్టు కాదు.

ప్రజల్ని చూడాలి. ప్రజల జీవితాలు చూడాలి.

ఆ వూళ్ళో స్త్రీలూ, పురుషులూ, పేదలూ, ధనికులూ ఏ రకంగా, ఎటువంటి పరిస్థితుల్లో జీవిస్తున్నారో కొంచెమైనా గ్రహించగలిగితేనే ఆ వూరు చూసినట్టు.

★ చక్కగా పెరిగి గాలికి వూగుతూ పచ్చని సముద్రమల్లే కన్నుల పండువుగా వున్న పొలాలు చూపిస్తూ కృష్ణమోహన్ ఇందిరతో, "ఇదంతా తులసి పొలం" అంటాడు.

ఎవరైనా వీణమీద ఎంతో చక్కగా శ్రావ్యంగా సంగీతం వాయించి నప్పుడు— "ఆ సంగీతం వాయించింది ఎవరు?" అనుకోవడం సబబా? "ఆ వీణ ఎవరిది?" అనుకోవడం సబబా?

ఆ వీణ, సంగీతం వాయించిన వ్యక్తిది కాదనుకోండి. ఆ ప్రతిభ అంతా వీణగల వ్యక్తిదా, వాయించిన వ్యక్తిదా?

వొక చక్కని బొమ్మ చూసి, "ఈ బొమ్మ ఎవరు వేశారో?" అనుకుంటామా, "ఈ కుంచెలూ, అట్టలూ ఎవరివో?" అనుకుంటామా?

అలాగే, చక్కగా పండిన పొలాలు చూసి, "ఈ పంటలు ఎవరెవరు పండించారో? ఇంత చక్కనిపంట పండటానికి ఎందరు ఎన్నివిధాల కృషి చేశారో!" అనుకోవాలి. అంతేగానీ, "ఈ పొలాలు ఎవరి స్వంతమో, వీటి హక్కుదారు ఎవరో?" అనుకోవడం; 'వీణ హక్కుదారు ఎవరో' అనుకోవడం లాంటిదే.

పొలం ఎవరి స్వంతం అయినాసరే ఆ "మంచి పంట"కు కారకులైన వార్ని గుర్తించడమే ముఖ్యం.

"తులసి పొలం" అని కృష్ణమోహన్ చెప్పిన పొలంచూస్తూ ఇందిర, "ఎకరానికెంత ధాన్యం పండుతుంది?" అని అడుగుతుంది.

ఆ ప్రశ్నతోపాటే, "ఎకరానికెంతమంది పనిచేసి ఈ పంట పండించారు? ఈ పంటలో వారికి ఎంత భాగం దక్కుతుంది?" అని కూడా అడిగిందా? అడగలేదు. అది తెలుసుకోవాలనే ధ్యాసే ఇందిరకు లేదు. మన ఆలోచనలు మనకు అలవాటైన మార్గంవేపేగానీ, ఇతర మార్గాలవేపు వెళ్ళనే వెళ్ళవు.

★ పెళ్ళిసంబంధం గురించి కృష్ణమోహన్ తులసితో చెప్పేమాటలు ఎంత జుగుప్సాకరంగా వున్నాయో?— "నిన్ను అన్యాయం చెయ్యను తులసీ! పెద్ద వుద్యోగస్తుడికిచ్చి పెళ్ళి చేస్తాను. హాయిగా పట్నాల్లో పెద్ద హోదాలో వుంటావు. నీ భర్త నీకు దాసుడైపోతాడు. అన్ని సరదాలూ అనుభవిస్తావు...." — ఈ రకంగా.

"పెద్ద వుద్యోగస్తుడి కివ్వడం" "పెద్ద హోదాలో వుండడం" "పట్నాల్లో హాయి అనుభవించడం" "భర్తని దాసుణ్ణి చేసుకోవడం"—ఈ రకంగా చాలా సిగ్గుచేటు అభిప్రాయాలు వెలిబుచ్చాడు కృష్ణమోహన్.

★ కథలో ఈ పాత్రలన్నిటి వెనకా వొక అనామకమైన పాత్ర వుంది. ఆ పాత్ర, కృష్ణమోహన్ పాలేరు 'అప్పన్న'. అతను ఎంత చాకిరీ చేస్తాడో! అందరికీ ఎన్ని సుఖాలు సమకూరుస్తాడో? కానీ, ఏసుఖంలోనూ అతనికి భాగం లేదు. అన్నపూర్ణమ్మనీ, తులసినీ, కొందరు ఇతర వ్యక్తుల్నీ కొంచెం పరిశీలించిన ఇందిర, అప్పన్నవేపు దృష్టి పోనివ్వలేదు. ఆమె ఆలోచనకు అందినంత వరకూ అప్పన్న "మంచి దాసుడి"గా మాత్రమే

కనపడ్డాడు. "నోటినుంచి మాట రాకుండానే సంతోషంగా, ఆప్యాయంగా ప్రవర్తించే అప్పన్న దాస్యం" ఆమెకు చాలా నచ్చి, సంతోషం కలిగించింది.

ఇందిర ఏదో వొక సందర్భంలో అప్పన్నతో కొంత సంభాషించి, అతని ఆర్థిక పరిస్థితులూ, సంసారం పరిస్థితులూ తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తే, ఎంతో న్యాయంగా వుండేది!

ఇందిర పట్నంనించి పల్లెటూరు చూడ్డానికి వొచ్చింది. వెళ్ళింది. ఆ రాక పోకల మధ్య వొక కథ నడిచింది. ఆ కథ ఏమీ మారకుండానే పాత్రల సంభాషణల్లో, ఆలోచనా విధానంలో కొంత చైతన్య వంతమైన ధోరణి చూపించ వొచ్చును.

అలా చూపించలేక పోవడానికి కారణం, రచయిత్రి. సమాజ ప్రభావంలో మునిగి వుండడమే.

రంగనాయకమ్మ.

26-12-1975

# పల్లెటూరు

కృష్ణమోహన్ ఇంటికి ఉత్తరం వ్రాశాడు.

"ప్రియమైన అమ్మకు....

హృదయ పూర్వకంగా నమస్కరించి నీ కృష్ణ వ్రాసేది:

నేను క్షేమంగా వున్నాను. నువ్వూ, తులసీ, మన వాళ్ళంతా క్షేమమని తలుస్తాను. ఈ పరీక్షలు బాగానే వ్రాశాను. శెలవు లిచ్చారు. ఆదివారం సాయంత్రం ఇంటికొస్తాను. నాతోపాటు ఇందిర కూడా వస్తున్నది ఇందిర గురించి చాలా సార్లు మీతో చెప్తూవుంటాను, తెలుసుగా? ఇందిరకు పల్లెటూళ్ళు చూడాలని ఎన్నాళ్ళనుంచో కోరికట. వాళ్ళ బంధువులంతా పట్నవాసమే. ఒకళ్లో, ఆరో పల్లెల్లో వున్నా వాళ్ళ దగ్గర కెళ్ళటానికి ఇష్టం లేదట! రెండేళ్ళ నుంచీ తెలిసిన వాణ్ణిగాబట్టి నాతో పంపటానికి వాళ్ళ పెద్దవాళ్ళకేం అభ్యంతరం ఉండదు. నేనంటే, ఇందిరనాన్నకి, అమ్మకి అభిమానం, నమ్మకం. వాళ్ళమ్మగారే స్వయంగా అడిగారు—"మా ఇందిరను జాగ్రత్తగా తీసికెళ్తావం?" అని. "జాగ్రత్తేమిటో నాకు తెలీదండీ. మీ అమ్మాయి నా వెనకే నడిచి వస్తే జాగ్రత్తగానే తీసుకెళ్తాను" అన్నాను. ఎంత బస్తీపిల్లయినా కాలేజీలో చదువుతున్నా ఇందిరకు తగని సిగ్గు, కొత్త వాళ్ళతో మాట్లాడానికే బిడియపడే ఇందిర నాతో మన వూరు వస్తానంటే నాకే ఆశ్చర్యం వేసింది. మన తులసి నయం ఝుమాయించి మాట్లాడేస్తుంది. ఎవరితోనైనా. మొత్తానికి ఇందిర నాతో వస్తున్నది. అవున్న నాలుగు రోజులూ బస్తీ పద్ధతులకి తగ్గట్లు బాగానే ఫలహారాలవీ రెండు పూటలా చెయ్యాలి. మైదా, పంచదారలాంటి వేమైనా కావాల్సొస్తే శెట్టి దగ్గర తెప్పించు. నేను వచ్చేటప్పుడు బిస్కట్లూ, జీడిపప్పూ, రవ్వా అవీ తీసుకొస్తాను.

తర్వాత సంగతేమిటంటే- మేడమీద గదీ, వసారా శుభ్రం చేయించు. కింద ఏర్పాటుచేస్తే కిందే వుంటుందనుకో. ఎలాగూ మనకి తాతలు సర్దాకి కట్టి పడేసిన భవనం వుందిగా! పైనైతే గాలి కూడా బాగా వస్తుంది, దక్షిణం వైపు. ఇందిర వున్న నాలుగు రోజులూ తులసిగూడా జతగా మేడమీదే వుంటుంది. మరిచాను, స్నానాలదొడ్డి ఎలా వుంది? ఎప్పుడు చూసినా దడులూడి పోయి శిథిలావస్థలోనే వుంటుంది. కందికంపా, తాటాకూ పెట్టి అప్పన్నతో దొడ్డి కట్టించు. మనలా బస్తీవాళ్ళు మరుగు లేకుండా స్నానం చెయ్యరు. ఈ విషయం మాత్రం మర్చిపోవద్దు- ఇంకో విషయం. ఆదివారం సాయంత్రం కోచీకి స్టేషనుకి బండి పంపు. బండికి గూడుకూడా వుండాలి సుమా! పొద్దు పోతుంది. పొలాలవీ చూసుకుంటూ రావటానికి గూడు లేకపోతేనే బావుంటుందనుకో. కానీ, ఏమో ఈ కాలం నమ్మటానికి వీల్లేదు. నాలుగు చినుకులు పడ్డా నానాగొడవౌతుంది. గూడు చాప అల్లించాలని అనుకోవటమే గానీ ఎప్పుడూ శ్రద్ధ చెయ్యలేదు. ఈసారి తప్పకుండా అల్లించాలి. వీలైతే మేదరి వీరయ్యని పిలిపించి చెప్పు. పోనీ నే వచ్చి చెప్తాలే.

ఇందిర వచ్చే సంగతి ఇప్పుడప్పుడే అందరితోటీ చెప్పి రావద్దని చెప్పు తులసి తల్లికి. కిందటిసారి యిచ్చిన పుస్తకాలేమైనా వుంచిందా, వాళ్ళకీ వీళ్ళకీ బొమ్మలు చూసుకోటానికిచ్చేసిందా? మొన్న పంపిన పుస్తకాలు అందాయా? అప్పుడప్పుడూ వుత్తరాలు రాస్తుందమని కార్డులిచ్చి వచ్చాను. వాటి నే గంగలో పడేసిందీ? ఒక్కటికూడా రాసిందిగాదేం? ఈ సారి మంచిమంచి పుస్తకాలు తెస్తున్నానని చెప్పు. ఊరికే యిళ్ళట్టుకు తిరక్క పంపిన పుస్తకాలు చదువుకోమను. ఇందిరని చూసైనా కొంత కుదురు నేర్చుకుంటుందేమోలే!

అన్నట్టు మరి ఇందిర వెళ్ళిపోయేటప్పుడు ఒక చీరైనా పెట్టక పోతే బావుంటుందా? అప్పటికప్పుడు మన వూళ్ళో చీరలెక్కడ దొరుకుతాయి? అందుకే ఇక్కణ్ణుంచే ఓ చీరా జాకెట్టు గుడ్డా తేవాలనుకుంటున్నాను. డబ్బు మిగిల్తే తులసికి కూడా తెస్తాను- ఇంక విశేషాలేం లేవు. స్టేషన్‌కి బండి మాత్రం కాస్త తొందరగా పంపించు.

మన బర్రావు ఈనిందా? ఈనితే ఉత్తరం రాయించే దానివే కదూ?

ఈపాటికి పెద్ద కొమ్ముల గేదకూడా ఈనమోపై వుండాలి- సరే. ఇంక కబుర్లేం లేవు.

—కృష్ణమోహన్."

తులసి, గట్టుమీద కూర్చుని ఉత్తరం చదువుతోంటే మినుములు బాగు చెయ్యటం ఆపి నవ్వుతూ వింటున్నది అన్నపూర్ణమ్మ. తులసి ఉత్తరం చదవటం కానిచ్చి దాన్ని అన్నపూర్ణమ్మ మీదికి విసిరికొట్టి "మామయ్యెప్పుడూ యింతే. నేనేం ఇళ్ళట్టుకు తిరుగుతున్నాను? పచ్చీసు ఆడుకోటానికి సరూ వాళ్ళింటి కెళతాను. లేకపోతే ఉయ్యాల లూగటానికి రాజేశ్వరి దగ్గరి కెళతాను. అంతేగా. ఏం? తప్పా? ఎక్కడికీ వెళ్ళకపోతే ఎలా తోస్తుందీ? నువ్వే చెప్పమ్మా!" అంటూ అమ్మమ్మ వీపు మీద పడి మెడ చుట్టూ చేతులేసి ఊపుతోంటే అన్నపూర్ణమ్మ అంది -"ఏమిటే ఇది? చిన్న పిల్లలా? ఈ చిలిపి తనమే వద్దంటాడు మావయ్య. ఏదో సర్దాకి రాశాడు కానీ, నీ మీదేం కోపమా? నీతో సరస మాడకపోతే ఎవరితో ఆడతాడే? వచ్చాక ఎందుకన్నాడో మావయ్యనే అడుగుదువు గాని, ముందు నా వీపు మీదనుంచి లే తల్లీ- కాస్తదొడ్డి దగ్గరకి వెళ్ళి అప్పన్నని పిల్చుకురా, ఉత్తరంలో సంగతులు చెపుదాం"

తులసి, అమ్మమ్మ వీపు మీదనుంచి లేచి పక్కన కూర్చుంది. మినుములు ఎత్తి గుప్పెళ్ళతో పోసి ఆడుతూ.

చేటలో పడ్డ ఉత్తరాన్ని తులసి ఒళ్ళో పెట్టి, చేట చేతుల్లోకి తీసుకుంటూ, అంది అన్నపూర్ణమ్మ, "రేపే కదూ ఆదివారం? ఆ పిల్లకి మన వంటలవీ ఎలా వుంటాయో! నా కేమో అంత సుతారంగా చెయ్యటం రాదు. ఆ నాలుగు రోజులూ కాస్త పద్మని పిలిస్తే బాగుంటుంది కదూ? బస్తీ వంటలవీ దానికి తెలుస్తాయి."

తులసి మూతి తిప్పి తేల్చిపారేస్తూ అంది. "ఆఁ, సింగినాదం, బస్తీ పిల్లయితే మాత్రం బంగారం తింటుందేమిటి? పద్మా వద్దు ఎవరూ వద్దు. నే చేస్తా చూస్కో!"

అన్నపూర్ణమ్మ నవ్వింది. "పోసీలే, ఏదో ఒకటి చేద్దాంగాని అప్పన్నని పిల్చుకురా, నీళ్ళ దొడ్డి కట్టమంటాను."

"వెళతాను గానీ మావయ్యకి అంత ఆరా ఏమిటి? పైకి ఏమీ పట్టించు కోనట్టే వుంటాడు. చీర పెట్టాలనికూడా తెలుసు కాబోలు!"

"అవును మరి. మొగపుటక పుడితే మాత్రం మంచి చెడ్డలు తెలియొద్దూ ? ఇలాంటి సంసార విషయాలన్నీ తెలిసిన మగవాడైతే ఆడదాని కెంతో సుఖం తెలుసా ? అంతా నీ అదృష్టమేలే...."

తులసి నవ్వు దాచుకుంది. జడ ముందు కేసుకొని సరిజేసుకొంటూ అంది - "నాకు తెలీకడుగుతాను బస్తీపిల్ల మన పల్లెటూళ్ళో ఏం చూస్తుందీ! కార్లుంటాయా? రైళ్ళుంటాయా?"

"ఏమో ! ఏం చూస్తుందో ? నాకు మాత్రం ఏం తెలుసు ? ఆ వున్న నాలుగు రోజులూ కాస్త మర్యాదగా చూసి పంపిస్తే చాలు."

"ఆ ఇందిర ఎలా వుంటుందమ్మా ? బాగా మాట్లాడుతుందా?"

"నీ కన్నీ అనుమానాలేనే. మాట్లాడక పోట్లాడుతుందా ? ఎలా వుంటుందేమిటీ ? నీకులా వుంటుంది. కాకపోతే ఎంతైనా బస్తీ పిల్లగదూ? పైగా చదువుకుంటున్నది గాబోలు, నాజూగ్గా వుంటుంది."

తులసికి మరో అనుమానం - అమ్మమ్మ మందలిస్తే వూరుకోవటం ఎప్పుడూ అలవాటు లేదయ్యే !

"పరాయి మగవాడితో యింకో వూరెలా వస్తుందే? సిగ్గు వెయ్యదూ? లేకపోతే భయం వెయ్యదూ!"

"ఎందుకూ భయం? మనమేం మనుషులం గామా? బళ్ళో జతగా చదువుకునే పిల్లకాబోలు ! వాళ్ళ పెద్దవాళ్ళు కూడా ధైర్యంగా పంపు తున్నారు. పరాయివాడేమిటి? నువ్వూ, సీతా క్రిందపేటాది రాఘవులుతో తిరనాళ్ళ కెలా వెళ్ళారు? రోజూ వుయ్యాల దగ్గరకి పరిగెడతావ్. రాముడు వుయ్యాలూపుతుంటే నీకు సిగ్గేస్తుందా? వెధవ కబుర్లు చెప్పక లేచి వెళ్ళి అప్పన్నని పిల్చుకురా. బోలెడు పనుంది" - మినుముల చేటపట్టుకులేచింది అన్నపూర్ణమ్మ. తులసి జడకుచ్చులు తిప్పుకుంటూ పరిగెత్తింది.

★ ★ ★ ★

ఆదివారం సాయంత్రానికి ఆ మండువా లోగిలి మామిడి తోరణా లతో కళకళలాడుతోంది. మేడమీద గదికీ వసారాకీ సున్నం కూడా వేయించింది తులసి. దగ్గరుండి రామితో, గచ్చంతా కడిగించి ముగ్గు లెట్టింది. ఆ సాయంత్రం కాసిని అగరొత్తులు కూడా వెలిగించి పెట్టింది బల్లమీద. రాత్రి భోజనంలోకి సున్ని ఉండలు తయారయ్యాయి. ఉత్త రపువేపు దొడ్లో వేపచెట్టుకింద స్నానాలదొడ్డి పునర్జన్మెత్తింది. తులసి అడా

విడిగా తిరుగుతోంది. అన్నపూర్ణమ్మ వంటగది వదిలి రావటంలేదు. అప్పన్న తలపాగా చుట్టుకుంటూ కూర్చుని ఎడ్లని అదిలించాడు. ఎడ్లు హుషారుగా మెళ్ళో మువ్వలు మోగించుకుంటూ స్టేషన్‌కి దారితీశాయ్.

★ ★ ★ ★

కృష్ణమోహన్ రైల్లోంచి ప్లాట్‌ఫారం మీద దిక్కులు చూస్తున్న అప్పన్నని కేకపెట్టాడు—"ఒరేయ్ అప్పన్నా! ఇటు—ఇటు."

అప్పన్న పరిగెత్తాడు. కృష్ణమోహన్ రెండు పెట్టెలు, బెడ్డింగూ అందిస్తే వాటిని తీసికెళ్ళి బండిలో పెట్టి ఎడ్లని అదిలించి బండికట్టాడు. కృష్ణమోహన్, ఇందిరా స్టేషన్ పక్క పొగడచెట్టు కింద నించున్న బండి దగ్గర కొచ్చారు. రైల్లో వాళ్ళంతా చూస్తుండగా ఎడ్లబండిలో ఎక్కటం సిగ్గనిపించింది ఇందిరకి. ఇందిర బాధపడనవసరం లేకుండా రైలు ఓ సారి కూతేసి నెమ్మదిగా కదిలి వెళ్ళిపోయింది. ఆ చిన్న స్టేషన్ అప్పటి కప్పుడే నిర్మానుష్యమై పోయింది. స్టేషన్ మాస్టర్ మాత్రం ఇందిర కేసీ, ఎడ్లబండి కేసీ చూస్తూ నిలబడ్డాడు బెంచీ దగ్గర.

"ఎక్కు" అన్నాడు కృష్ణమోహన్ ఇందిరని చూస్తూ నవ్వుతూ.

"ఎలా ఎక్కాలి?" అంది ఇందిర తనూ నవ్వి.

"చక్రం మీద నుంచి యెక్కు"- కృష్ణమోహన్ చక్రం ఆకుల మీద కాలువేసి చూపించాడు.

"ఛ, అదంతా బురద. చీరంతా పాడైపోదూ?"

"ఏరా అప్పన్నా! చక్రాలనిండా బురదెందుకు చేసుకొచ్చావురా? ఈవిడ చీరంతా పాడైపోదూ?" అప్పన్నని కసురుకున్నాడు కృష్ణమోహన్.

అప్పన్న పకాలుమన్నాడు- "రాత్రి వానపడింది బాబూ! పైగా దారి సరిలేదు. లేకపోతే ఇంతగా మట్టి అంటుకోకపోను. బండి యిప్పేస్తాను, తొట్లోంచి యెక్కండి అమ్మాయిగారూ!" అంటూ అప్పన్న ఎడ్లను వూడదీసి తొట్టి నేలమీదకి దించాడు.

ఇందిర ఎడ్లు పొడుస్తాయేమోనని భయంగా తొట్లోంచి యెక్కి బండిలో కూర్చుంది. అప్పన్న తిరిగీ బండి కట్టాడు, కృష్ణమోహన్ చక్రం మీదనుంచి యెక్కి తొట్లో కూర్చుని పగ్గాలు చేతిలోకి తీసుకున్నాడు. అప్పన్న యెడ్లముందు దారి సాగించేసరికి బండి కదిలింది. యెడ్ల మెళ్ళో మువ్వలు గలగలా మోగసాగాయి.

ఇందిరకి జోడెడ్లబండి ప్రయాణం కొత్తగా వుంది. బండిలో ఒత్తుగా వేసిన గడ్డిమీద తుంగచాప, పైన దట్టంగా గూడు! తడిక కానుకు కూర్చుని, కృష్ణమోహన్ బండి తోలటం చూస్తోంది ఇందిర.

"మీ కోసం అమ్మగారూ, తులసమ్మగారూ తెగ హడావిడి చేస్తున్నారండీ అబ్బాయిగారూ!" అన్నాడు అప్పన్న ముందు నడుస్తూ.

"తులసి హడావిడికేంలే. ఉరుకులూ, పరుగులూ! కాస్తంతని గంపంత చేసేస్తుంది, ఈ పాటికి వూరంతా చాటేసి వుంటుంది, ఈ శుభవార్త!"

బండి పొలాల మధ్య పడింది. ఏపుగా ఎదిగిన పరికర్రలు గాలికి హాయిగా తల లూపుతున్నాయి. కన్నానినంతమేరా పచ్చటి వరిచేలు! ఇందిర వింతగా చూస్తోంది పొలాల కేసి.

"టాపు లేకపోతే బావుండేది." అంది అప్రయత్నంగా దూరంగా చూస్తూ.

కృష్ణమోహన్ నవ్వాడు. "టాపు గాదిది ఇందిరా! గూడు! నువ్వు మీ పట్నానికీ, కాలేజీకి దూరంగా నిజమైన ప్రకృతి సౌందర్యాన్ని చూడ్డాని కొస్తున్నావు. ఈ నాలుగు రోజులూ ఆ ఇంగ్లీషు ముక్కలూ, సిటీ మేనర్సూ మర్చిపోవాలి. నువ్వన్నట్టు గూడు లేకపోతేనే బావుండేది. కానీ నాలుగు చినుకులు పడితే మాకేంగానీ నువ్వు నానిపోతావ్. అసలే మీ వాళ్ళంతా జాగ్రత్తంటూ ఏకరభస! నీ కే రొంపైనా పడితే నాకు చేస్తారు వైద్యం. ఒరేయ్ అప్పన్నా! గూడా తీసేద్దాంరా? అమ్మాయిగారికి పొలాలు సరిగా కన్పించటంలేదట."

"వద్దయ్యా! వానొస్తుంది."

"బండింత ఖాళీగావుంటే అతను నడవటం దేనికి?" సానుభూతిగా అంది ఇందిర.

"ఒరేయ్ అప్పన్నా! నువ్వు నడవకూడదట్రోయ్. పాపం ఈ బుల్లెమ్మ గారిది జాలిగుండె. వచ్చి తొట్లోకూర్చో-నే లోపలికెళ్తా."

"మాటకు ముందిలా వెక్కిరిస్తే నే నసలురాను. స్టేషన్ దగ్గర దింపెయ్, మా వూరు పోతాను." అంది ఇందిర మూతి ముడుచుకుని చిరుకోపంగానే.

కృష్ణమోహన్ నవ్వాడు. "ఆడవాళ్ళు అలిగితే అందం సుమా!"

ఇందిర వినిపించుకోనట్లు దూరంగా జోగే పొలాలమీదకి చూపు మరల్చి కాళ్ళచుట్టూ చేతులు చుట్టుకొని ముడుచుక్కూర్చుంది. చూస్తుండ గానే సన్నగా జల్లు ప్రారంభమైంది. అప్పన్న తలపాగావూడదీసి తలమీద కప్పుకోవటం చూసింది ఇందిర. "అతను వర్షంలో తడిసిపోవటం లేదూ; అలా ఆ బురదలో ఎంతసేపని నడుస్తాడు? పెట్టెలు తొట్లో దేనికి? బెడ్డిం గయినా లోపలపెట్టు. వర్షం రావటం తెలుస్తోందా అసలు?"

"బాబోయ్! ఏమిటీ సాధింపూ? వాటిమీద ఒంక పెట్టకపోతే, చలే స్తోంది లోపలికి రమ్మంటే రానూ?"

ఇందిర కృష్ణమోహన్ కళ్ళలోకి కోపంగా చురుగ్గా చూసింది.

"ఎందుకంత కోపం? నేనే మన్నాననీ?"

"చాల్లే. మాటలు నేర్చావ్"-

కృష్ణమోహన్ బండి ఆపు చేశాడు.

"ఒరేయ్! అప్పన్నా! వర్షం జోరయ్యేలావుందిరా! తొట్లోకిరా! నే లోపల కూర్చుంటా" అన్నాడు కృష్ణమోహన్. పెట్టెలు, బెడ్డింగ్ లోపల పెట్టి బెడ్డింగ్‌మీద కూర్చున్నాడు. అప్పన్న తొట్లోంచి కాస్తగడ్డిలాగి బుర దంతా తుడుచుకొని తొట్లో ఎక్కాడు.

వర్షం జోరైంది. చలిగాలి రయ్యిమని ఎడా పెడా విసురుతూంటే ఇందిర పైటచెంగు తలమీదుగా వేసి చెవులు కప్పుకుని కూర్చుంది. గడిచి వచ్చిన దారిమీద బురదలో బండి చక్రాల చాళ్ళు చూస్తూ,

"ముసుగులో నిన్నెప్పుడూ చూళ్ళేదు ఇందూ! అర్ధగ్రహణం పట్టిన చంద్రబింబంలా...." అన్నాడు కృష్ణమోహన్.

ఇందిర చాపమీద చూపు గుచ్చింది.

"నువ్విలా సాధిస్తావని తెలిస్తే నేనసలు రాకపోదును" ఎక్కడ అప్పన్నకి వినపడుతుందోననే భయంతో చాలా నెమ్మదిగా అంది ఇందిర, దగ్గిరగా జరిగి కూర్చున్న కృష్ణమోహన్‌కి దూరంగా జరుగుతూ.

"అరెరె, పడిపోతావ్! మరీ జరక్కు. నీ కెంతైనా పుణ్యం. నేనేం అనన్లే- ఒరేయ్ అప్పన్నా! కాస్త హుషారుగా పోనీయ్‌రా! ఈ చలిగాలికి రొంప పడితే చచ్చేయాతన."

అప్పన్న ఓసారి ఎడ్ల నదిలించి ఏదో పాటందుకున్నాడు. అప్పన్న పాటకీ, మువ్వలమోతకీ జత కలిసింది. ఇందిర చాలాసేపు కూర్చుంది

ఆలోచిస్తూ. కృష్ణమోహన్ కర్చీఫ్ తీసి చెవులకి కప్పుకొని ఇందిర్ని చూస్తూ కూర్చున్నాడు.

"ఇంకా ఎంతసేపు?" ఉలిక్కిపడ్డట్టు అడిగింది ఇందిర, కృష్ణమోహన్ కళ్ళల్లోకి చూస్తూ-

"ఏమో, నాకూ తెలీదు" అన్నాడు కృష్ణమోహన్, మొహం అప్పన్నకేసి తిప్పి.

ఇందిర నవ్వింది- "ఏమోయ్ అప్పన్నా! ఇంకా ఎంతసేపు పడుతుందీ?" అంది ఇందిర గట్టిగా. అప్పన్న బండిలోకి చూసి చెప్పాడు- "వచ్చేశాం అమ్మాయిగారూ! మరి పది బారలుంటుం దంతే" అన్నాడు.

ఇందిర కేం అర్థం కాలేదు. కృష్ణమోహన్‌కి నవ్వొచ్చింది.

"అలా చెప్తే బస్తీపిల్ల కేం తెలుస్తుందిరా? ఇంకా ఎంత టైం పడుతుందో చెప్పాలి" అన్నాడు ఇందిరకేసి వారగా చూస్తూ.

"అది నా కెలా తెలుస్తంది బాబూ? మీరు చెప్పండి" అన్నాడు అప్పన్న.

"ఇంకా ఐదుగంటలు పడుతుంది. అంటే తెల్లారు జాముకి చేరుకుంటాం. ఏం విసుగ్గా వుందా? సుజాతా వాళ్ళకార్లో పక్కన నడిచేవాళ్ళ బట్టలమీద బురద చిందులు పడేలా దూసుకు పోతున్నట్టు లేదూ?"

"అహ్హా! కృష్ణమోహన్ బండిలో కుదుపులు తింటున్నట్టుంది."

అప్పన్న ఫక్కుమన్నాడు- "మా భలే చెప్పారే. తులశమ్మగారూ ఇంతే. మాటకి మాట!— ఆఁ, వచ్చేశాంలెండి అమ్మాయిగారూ! ఆ కనపడేదే వూరు."

అప్పన్న మరోసారి అదిలించాడు యెడ్లని కాస్సేపటికి బండి వూళ్ళోప్రవేశించింది. బాగా చీకటిపడిపోయింది. పైగా మబ్బులమయం! కారుచీకటిగా వుంది. అక్కడో దీపం, ఇక్కడో దీపం ఇళ్ళల్లోంచి మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నాయి. అప్పన్న తొట్లోంచి కిందికి దిగి నడుస్తున్నాడు.

"నా కేమిటో భయంగా వుంది"- అంది ఇందిర బెరుగ్గా.

కృష్ణమోహన్ దగ్గరికి జరిగి— "ఛ, యెందుకాభయం, నేను లేనూ? నీకేం ఫర్వాలేదు. మా అమ్మ చాలా మంచిది ఇందూ!" చీకట్లో ఇందిర తలనిమిరి ధైర్యం చెప్పాడు.

"వీధి గుమ్మం దగ్గర ఆపమంటారా; దొడ్లోకి పోనిమ్మంటారా?" అప్పన్న అడుగుతూంటే వీధరుగుమీద నించున్న అన్నపూర్ణమ్మ కలగ జేసుకుని అంది- "ఈ చీకట్లో దొడ్లో కెందుకురా? ఇక్కడే ఆపుజెయ్యి. సామానేదైనా వుంటే లోపల పెట్టు. ఏడీ కృష్ణ దిగడేం?"

కృష్ణ దిగాడు. అప్పన్న సామాను తీసికెళ్ళి చావిట్లో పెట్టివచ్చాడు. ఇందిర దిగటానికి తికమక పడిపోతూంది. వాళ్ళమ్మ అక్కడ లేకపోతే ఏదైనా అనేవాడే కృష్ణ. లేకపోతే చెయ్యయినా అందించును.

"ఒరోయ్! అప్పన్నా! సావిట్లో కుర్చీపీట వుంది. తెచ్చి వెయ్యరా?" అంది తులసి. అప్పన్న సావిట్లోకి పరిగెత్తాడు. ఇందిర పీటమీద కాళ్ళెట్టి నెమ్మదిగా కిందికి దిగి నుంచుంది.

"రామ్మా లోపలికి" అనునయంగా పిలిచింది అన్నపూర్ణమ్మ. ఇందిర కృష్ణమోహన్ వెనక నడుస్తూ సావిట్లో కొచ్చింది.

"అప్పన్నా! ఎడ్లని సావిట్లో కట్టి గడ్డిపడేసి తొందరగా రా! స్నానానికి నీళ్ళు తోడుదువుగాని" అని దొడ్లోకి బండి తోలుకెళ్తున్న అప్పన్నకి చెప్పి, సావిటిలో కొచ్చింది అన్నపూర్ణమ్మ.

"బట్టలవీ తీసుకోండి. కృష్ణా! నీళ్ళు కాగివున్నాయి స్నానాలు చేద్దురుగాని."

"ఆఁ చేద్దాం గాని- ఏం తులసీ, కులాసా? అలా మూతి ముడుచుకు నించున్నావేం?"

తులసి నిర్లక్ష్యంగా తల తిప్పుకుంది. అన్నపూర్ణమ్మ నవ్వుతూ అంది- "ఇళ్ళట్టుకు తిరుగుతుందని రాశావట ఉత్తరంలో, అందుకు ఆ కోపం."

"అదా కథ? మరి తిరగని వాళ్ళకి కోపం దేనికి? పోసీలే నువ్వు చాలా మంచిదానివి. ఇంత మంచిపిల్లని వుత్తిపుణ్యానికి అన్నందుకు లెంప లేసుకుంటాను. నీకు మంచి పుస్తకాలూ, చీరలూ తెచ్చాను, తీసుకో" అంటూ పెట్టె తెరచి పుస్తకాలూ, చీరెలూ తీసి తులసి కందించబోతే పుచ్చుకోకుండా అంది పెడసరంగా—"నాకేం అక్కర్లేదు."

అన్నపూర్ణమ్మ మందలించింది—"ఛ! ఏమిటి తులసీ? ఏదో సర్దాగా అన్నందు కంత పట్టుదల! మావయ్య సర్దాగా నీకోసం తెస్తే తీసుకోవేం? నీకు తెచ్చాడు గానీ నాకు తెచ్చాడా?" నవ్వింది-"ఐనా దానిదగ్గర మంచి

మంచి చీరలుండగా నువ్వు వేరే తేపటం ఎందుకు కృష్ణా? కావలిస్తే వాటిల్లో దొకటి...."

"ఏమో, ఇవి పరికిణీలు కడుతుందిగా? చీరలుంటాయనుకోలేదు" అన్నాడు కృష్ణ.

"అంతేనా, చీరలేం పనికొస్తాయనుకొన్నావా?" అంటూ వాటి నందుకుంది తులసి.

"రెండూనూ" పెట్టెలోంచి తుండు తీసుకుంటూ అన్నాడు కృష్ణ మోహన్.

ఆ సంభాషణ ఇందిరకేం అంతుపట్టలేదు. తలుపునానుకుని నించుంది.

"నువ్వు స్నానంచేస్తావా ఇందిరా?" కృష్ణమోహన్ ఇందిరనడిగాడు.

"పై నుంచి వర్షం పడుతోంటే దొడ్లో ఎలా స్నానం చేస్తుంది? నువ్వయితే ఏ చూరుకిందో పోసుకొస్తావు. కావాలంటే ఆవిడకూడా ఆ చూరుకిందే పోసుకోవాలి" అంది తులసి.

"ఐతే ఎలా? పోనీలే మానెయ్ మాధ్యాహ్నమేగా స్నానంచేసింది? చలిగా కూడా వుంది" కృష్ణమోహన్ ఇందిరను చూశాడు. ఇందిర మౌనం వహించింది.

"తులసీ ! గదిలోకి తీసికెళ్ళి కూర్చోబెట్టు. మావయ్య స్నానం చేశాక భోంచేద్దురుగాని" అంది అన్నపూర్ణమ్మ లోపలికెళ్తూ.

తులసి ఇందిరని దక్షిణంవేపు గదిలోకి తీసికెళ్ళి మంచంమీద కూర్చోమని లోపలికెళ్ళి పెద్ద చెంబుతో వేణ్ణీళ్లు తెచ్చి దొడ్డి చీడీలమీద పెట్టి "కాళ్ళు కడుక్కో" అంది.

ఇందిర కాళ్ళు కడుక్కువచ్చి తులసి చెప్పిన ప్రకారం మంచంమీద కూర్చుంది, గదంతా కలియజూస్తూ. తులసి కూడా మావయ్య తెచ్చిన పుస్తకాలు దీపంబుడ్డి దగ్గరకి జరుపుకుని తిరగేస్తూ కూర్చుంది. ఇందిర అన్నీ వస్తువుల్నీ చూస్తూ తులసిని దీక్షగా చూడసాగింది. తులసి ఇంత అందంగా వుంటుందనుకోలేదు సుమా తను! దృఢంగా వుంది. మంచి పర్సనాలిటీ! మోకాలికి పైకి కుచ్చెళ్ళ పరికిణీ ! వోణీ ! చేతులకి బంగారపు గాజులమధ్య నిండుగా మట్టిగాజులు! కాళ్ళకి చక్కటి మువ్వల పట్టాలు! మెళ్ళో కాస్త పాతదనిపించే మూడు వరసల చంద్రహారం! బారెడు జడకి పొట్టికుచ్చులు! చెవులకి చిన్న జూకాలు!— "పల్లెపడుచు" అనుకుంది ఇందిర తదేకంగా

చూస్తూ.

తులసి కూడా ఇందిరమీద ఒక్కోచూపు విసుర్తూ పుస్తకాలు తిరగేస్తోంది. పల్చటి సిల్కుచీర ! చేతులకి రెండేసి బంగారు గాజులు ! ఎడంచేతికి రాళ్ళ ఉంగరం ! చెవులకి ఒకే రాతిజోడు ! మెళ్ళో సన్నటి గొలుసు! తన జడంత బారు కాకపోయినా పొడుగనిపించే నొక్కుల జుట్టు. సన్నగా నాజూకైన శరీరం!- 'ఎంతైనా బస్తీపిల్లకదూ! నాజుగ్గా వుంది.! అందగత్తే' - అనుకుంది తులసి. అలా మౌనంగా కూర్చోవటం ఇందిర కెలావున్నా తులసికి దుర్భరంగా వుండి మాటల్లోకి దించింది - "నువ్వూ మా మావయ్య చదువేనా?"

"అవును. నువ్వేం చదువుకున్నావ్ ?" అంది వెంటనే ఇందిర, సమయంకోసం కాచిపెట్టుకూర్చున్నట్టు. తులసి తేలిగ్గా తోసిపారేస్తూ "ఆఁ నే నేం చదువుకున్నానూ ? ఏదో పల్లెటూరి చదువు. మా మావయ్యే అప్పుడప్పుడూ పుస్తకాలు తెస్తుంటాడు. అందుకనే ఇటువంటివన్నీ చదివి అర్థంచేసుకోగలను."

"ఇక్కడ చదువైపోగానే మీ మావయ్యతోపాటు బస్తీలో చదువు కోలేక పోయావా?"

"అప్పుడు మావయ్యకే గగనమైపోయింది, బస్తీ చదువుకు వెళ్ళటం. మా అమ్మ కిష్టముండేదికాదు బస్తీ కెళ్ళటం. ఐనా ఎలాగో వెళ్ళాడు. అప్పుడప్పుడూ నన్నూ చదివించాలనేవాడు. మా అమ్మకి ఇంట్లో సాయంగా వుండాలనీ, ఆడపిల్లని బస్తీలో వుంచటానికి బోలెడు శ్రమ పడాలనీ- ఏదైతేనేం; మా పల్లెటూరివాళ్ళకి చదువు లెలా అందుతాయి ?" అంది తులసి - చదువుకోవాలనే కాంక్ష తనకీ వుండేదని బాధపడుతూ.

"అవును. అందరికీ చదువుకొనే సౌకర్యాలు లేవు. ఊళ్ళోనే స్కూళ్ళూ, కాలేజీలూ ఉండబట్టిగానీ లేకపోతే మా గతీ యింతే. ఎంతైనా మన పెద్దవాళ్ళకి ఆడపిల్లలు చదువుకోటం అంత యిష్టముండటంలేదు. ఎంతైనా ఖర్చు పెట్టి చదివించుకోగల స్తోమతున్నవాళ్ళు కూడా ఏమిటో నిర్లక్ష్యం" ఇందిర సానుభూతిగా అంది నెమ్మదిగా.

"మీ బస్తీవాళ్ళదృష్టవంతులు" అంది తులసి నవ్వుతూ. ఇందిర మౌనంగా వూరుకుంది.

"అమ్మాయ్ ! తులసీ ! అన్నాలకి రండి. మావయ్య వచ్చాడు,"

అంటూ అన్నపూర్ణమ్మ కేక వెయ్యగానే తులసి లేచి నుంచుంది. ఇందిరని వెంటబెట్టుకుని పడమటింటిలోకి వెళ్ళింది.

భోజనాలదగ్గర కృష్ణమోహన్‌కి చెరోవైపు ఇందిరా, తులసీ! అన్నపూర్ణమ్మ ఇందిరకి, అప్పన్న కోసి తెచ్చిన అరిటాకులో వడ్డించ బోతూంటే కృష్ణమోహన్ వారించాడు.

"మరేం ఫర్వాలేదు. పళ్లెంలో పెట్టెయ్యి. వెండిదే కదూ? అంటు వుండదు. ఏం ఇందిరా! నువ్వు ఆకులో తింటానంటే మేమిద్దరంకూడా ఆకుల్లోనే"

"అవును మావయ్యా!" అంది తులసి. ఇందిర నవ్వింది. అన్నపూర్ణమ్మ మూడు వెండిపళ్ళెలలో వడ్డించింది. పళ్లెంలో ఒకవైపు వీశరాళ్ళలాంటి రెండు సున్నివుండలూ, మరోవైపు గిన్నెడు పులిహోరా! "వచ్చింది పల్లెటూరు కాబట్టి మా వంటలన్నీ తినటం నేర్చుకోవాలి" అంది తులసి నెయ్యి వేయించుకొంటూ.

"తినటమేగాదు. వండటంకూడా నేర్చుకోవాలి," అన్నాడు కృష్ణమోహన్ ఇందిర మొహంలోకి చూస్తూ. ఇందిర ఆ రెండు సున్ని వుండలూ ఎలాగూ తినలేదు కాబట్టి ఎంగిలిచెయ్యకుండా తీసివెయ్యాలని తటపటాయిస్తూ అవి రెండూ తీసి తులసి పళ్లెంలో పెడుతూ అంది-"నేను తినలేను."

"అదేమిటమ్మాయ్! ఒకటైనా తీసుకో" అంది అన్నపూర్ణమ్మ మందలింపుగా.

"అసలు చేసింది నీకోసం- నువ్వు తినకపోతే మేమెలాతింటాం?" అంది తులసి తిరిగియిస్తూ. ఇందిర చెయ్యి అడ్డంపెట్టి దాదాపు బ్రతిమాలు తున్నట్టే అంది - "లేదు తులసీ! ఇప్పుడు తిన్లేను."

"పోనీలే తులసీ! బలవంతం దేనికి?" అన్నాడు కృష్ణమోహన్ ఇందిర స్థితి అర్థంచేసుకుని

"బస్తీవాళ్ళు నాజూగ్గా తింటారు కాబోలు" అంది తులసి వేళాకోళంగా.

"అవును మరి మనలా, అందులోనూ నీలా, తింటారా మరి?" కృష్ణమోహన్ విసురికి తులసికి పౌరుషం పొడుచుకు వచ్చింది. "అది నాజూకు కాదోయ్ మావయ్యా! తిని అరాయించుకోగలశక్తి వుండొద్దూ?

కాస్త తింటే కడుపునొప్పి, తెల్లారి డాక్టర్లూ, మీ బస్తీవాళ్ళ బడాయిలకేంలే?"

"చూశావా ఇందిరా? తులసి ఎలా మాటకి మాట అప్పచెప్పిందో!"

"అవును మరి! అంతా నాలా వుంటారేం?" అంది ఇందిర.

తులసి ఫక్కుమంది.

"ఓడిపోయాడోయ్! మే మిద్దరం; నువ్వొక్కడివే" అంది తులసి.

"కాదులే, మేమూ ఇద్దరం. మా అమ్మ లేదూ?"

ఇందిర కాస్త పులిహోర తిన్లేక చెయ్యి కడిగేసుకుంది.

"అదేవిటి ? అన్నం వడ్డించుకోవూ ?" అడిగింది అన్నపూర్ణమ్మ ఆప్యాయంగా.

"వద్దండీ! ఇదే ఎక్కువైపోయింది" అంది ఇందిర.

"పోనీ పెరుగు పొయ్యమ్మా వేరే పళ్లెంలో" అంది తులసి.

"పెరుగసలు వద్దు. రాత్రిళ్ళు పెరుగు వేసుకోము " అంది ఇందిర.

"భలే మనుషులే ! ఏమీ తినకపోతే మీరు తినేదేమిటి ?" అంది సాగదీస్తూ తులసి.

అన్నపూర్ణమ్మ వంటపాకలో కెళ్ళి దానిమీద కాగుతున్న పాలు వెండిగ్లాసుడు తెచ్చి చల్లార్చి పంచదారవేసి బలవంతంగా యిచ్చింది. బాగుండదని ఇందిర పాలు తీసుకుని తాగుతూ కూర్చుంది పీటమీద.

"అయితే మాకూ పాలే పొయ్యి" మారాం చేస్తున్నట్లు అన్నాడు కృష్ణమోహన్.

తులసి పళ్ళెం ఖాళీచేసి- "నువ్వెంత పేచీపెట్టినా లాభంలేదు మావయ్యా ! మనం పాలు తాగేస్తే రేపొద్దుటికి పెరుగు నాస్తి. ఆవు ఈనేవరకూ ఇందిర కొక్కదానికి పాలు" అంది.

అన్నపూర్ణమ్మ యిద్దరి పళ్ళాలనిండా పెరుగుపోసింది.

"అయితే మావయ్యా! ఈ వానాకాలం ఏం చూస్తారూ? ఏక బురద! జోరుమంటూ వాన ! వేసంకాలమైతే హాయిగా వుండేది కాదూ?" అంది తులసి పెరుగన్నం తింటూ.

"తెలివి తెల్లారినట్టే వుందిలే. అసలు పల్లెటూళ్ళు చూడాల్సింది వర్షాకాలం. వేసవికాలం ఏం వుంటుంది? నిద్రపోయే ప్రకృతి మేల్కొం టుంది తులసీ ఈ ఋతువులో."

"ప్రకృతంటే ఏమిటి మామయ్యా?" అంది తులసి చిలిపిగా చూస్తూ.

ఏం చెపుతాడోనని. ఇందిర పెదాలు బిగబట్టి చూస్తూ కూర్చుంది. కృష్ణ మోహన్ తటపటాయించాడు.

"ఇప్పుడు చెప్పను. రేపు చూపిస్తాను."

"చెప్పటం చేతగాకపోతే సరి" — అంది ఫక్కుమని నవ్వుతూ తులసి. ఇందిర పైట అడ్డుపెట్టుకుంది నవ్వుతూ,

"చాల్లే, పళ్ళాలు తీసేస్తాగానీ అమ్మాయిని పైకి తీసికెళ్లు. పొద్దు పోయింది." అంది అన్నపూర్ణమ్మ మందలింపుగా. తులసి చెయ్యి కడుక్కుని లేచి, ఇందిరని పైకి తీసుకెళ్ళింది. గదీ, వసారా విశాలంగా పరిశుభ్రంగా వున్నాయి. కొత్తగా సున్నంవేసిన ఘాటు! వెలుగుతూన్న అగరొత్తుల సువాసన! మామిడితోరణాల పరిమళం! వింతగా వుంది! రెండు మంచాలమీద తెల్లటి పక్కలు!

కిటికీదగ్గర బల్లమీద ఇందిర పెట్టెవుంది. ఇందిర కిటికీతీసి చూస్తూ నించుంది. కారుచీకటి. కొత్త ప్రదేశం. ఏమీ కన్పించటంలేదు. ఐనా కన్నానని నంతవరకూ పేరుకుపోయి వున్న చీకటీ, లీలగా కనిపించే చెట్లూ చూడా లనిపించింది.

"కిటికీ తీసివుంచితే జల్లుకొడుతుంది గదిలోకి" అంది తులసి. తల గడనానుకు కూర్చుంటూ. ఇందిర కిటికీమూసివచ్చి మంచంమీద కూర్చుంది- "కృష్ణమోహన్ అమ్మగార్ని నువ్వూ అమ్మా అంటావేం?" అంది, ఎంతోసేపట్నుంచి ఉన్న అనుమానాన్ని తీర్చుకోవాలన్నట్టుగా.

"చిన్నప్పట్నుంచి అదే అలవాటు! మావయ్య ఇంట్లో అలానే పిలుస్తూంటే నాకూ అలవాటై పోయింది. మా అమ్మని నే నసలు ఎరగను. చిన్నప్పుడే...."

"అవునట. మీ మావయ్య చెప్పాడు. మీ నాన్నగారు ఎప్పుడైనా వస్తుంటారా?"

"ఆc, నేనూవెళుతుంటాను. మా పిన్ని చాలామంచిది. ఐనా మా అమ్మ నన్నిక్కడే వుంచుకొంది. నా బాధ్యతంతా వీళ్ళదే. మా అమ్మకి పదెకరా లిచ్చారు. అవి నావే. మావయ్యే చేయిస్తున్నాడు. ఈ ఏడాది నా డబ్బు పెట్టి మరో నాలుగైదెకరాలు కొంటారట."

"నీకు నగలేం ఉన్నాయి?" అడిగింది ఇందిర కుతూహలంగా.

"ఇంకా ఏం లేవు. కాని చేయించుకుంటాను. మా అమ్మే అశ్రద్ధ

చేస్తోంది" అంది తులసి.

"ఇంతవరకూ చిన్నపిల్లవని వూరుకున్నారులే. నీకు చాలా డబ్బుంది కాబట్టి, మువ్వలవడ్డాణం- రవ్వల అరవంకీ, పావుకాసుల పేరూ - చక్కటి నెక్లెస్‌లూ అన్నీ చేయించుకో-" అంది ఇందిర నవ్వుతూ.

తులసికూడా నవ్వుతూ- "నిజంగా అంటున్నావా! వేళాకోళమా? బస్తీవాళ్ళు ఇటువంటినగలు చేయించుకోమని సలహాయిస్తారా?" అడిగింది.

"నిజం తులసీ! నా కటువంటి నగలు చాలాయిష్టం. నీలాంటి పల్లె పడుచు అటువంటి నగల్లో మునిగివుంటే సాక్షాత్తూ లక్ష్మిలా వుంటుంది. నగలు వుండడం ఆడదానికి పెద్ద అందకూడా" అంది ఇందిర.

"సరేగానీ బస్తీ పిల్లలు వాచీ పెట్టుకుంటారు, బూట్లు వేసుకుంటారని చెప్తాడు మామయ్య, మరి నీకు...."

"ఉన్నాయి. కానీ తెచ్చుకోలేదు. అవన్నీ చూస్తే మీ పల్లెటూరి వాళ్ళేమనుకుంటారోనని భయపడ్డాను."

ఇందిరకీ, తులసికీ చాలసేపు సంభాషణ జరిగింది. తులసిది సహృదయం- స్నేహగుణం అని అర్థంచేసుకుంది ఇందిర. పెద్దచదువులు మామయ్యతో సమానంగా చదువుకునే బస్తీపిల్ల తనతో అంత సన్నిహితంగా మెలగటం తులసికి చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. పల్లెటూళ్ళ ఆడవాళ్ళు అసభ్యంగా, మోటుగా ప్రవర్తిస్తారేమోనని భయపడిన ఇందిర మనసు అన్నపూర్ణమ్మ ఆప్యాయతకీ, తులసి అనురాగానికీ, కుదుట పడింది. ఆ రాత్రి కొత్త వాతావరణంలోనైనా హాయిగా నిద్రపోయింది.

* * * *

కోడికూతల జోరుకి ఇందిరకి మెలకువ వచ్చి ఉలిక్కిపడ్డట్టు లేచి కూర్చుంది. తులసి లేదు. పక్క చుట్టివుంది. దీపం చిన్నగా వెలుగుతోంది. లేచి కిటికీతెరచి చూస్తూ నించుంది. తెల్లగా తెల్లారిపోలేదు. ఎత్తుమీదనుంచి చూసేవాళ్ళకి చింతగుబుర్లోంచి వస్తున్న లేత భానుకిరణాలూ, అరుణరాగ రంజితమైన సూర్యబింబం ప్రశాంతంగా ఉంది. మనోహరమైన సూర్యోదయానికి చింతకొమ్మల మీదనించి పక్షులు కలకలా కూస్తూ మస్తుగా ఆకాశంలో ఎగురుతున్నాయి. అదే చింతకింద తడిఇసకలో నలుగురైదుగురు పిల్లలు బొమ్మరిళ్ళూ, పిచ్చికగూళ్ళూ కట్టుకుంటున్నారు. ఎదురింటి గుమ్మంలో ఒక అమ్మాయి ముగ్గు పెడుతోంది. అరుగుపక్కన ఓ ఆసామి

మొహం కడుక్కుంటున్నాడు. కుచ్చెళ్ళు పైకి పెట్టుకుని, భుజంమీద బిందె పెట్టుకుని వయ్యారంగా నడిచి వెళుతున్న యిద్దరు యువతుల్ని వేరుచేసి మధ్యనుంచి విసురుగా వస్తున్నాడో నీళ్ళకావిడి మనిషి. రోడ్డని చెప్పబడే ఆ దారంతా బురదగా ఉన్నప్పటికీ అంతా ఆ బురదలోనే తిరుగుతున్నారు హడావిడిగా. రాత్రి అతి నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణమంతా తెల్లవారకుండానే సందడితో నిండిపోయింది.

"పల్లెటూళ్ళలో పెందలాడే లేస్తారు. తొందరగా పడుకుంటారు" అనుకుంది ఇందిర. పక్క చుడుతూంటే తులసి వచ్చింది.

"నువ్వెప్పు డెళ్లిపోయావు? అంత తొందరగా లేచి ఏం చేస్తావూ?" అంది ఇందిర.

"ఏం చెయ్యటమేమిటి? తొందరగా లేవకపోతే ఇంట్లో పనెలా ఔతుంది? రామి వాకిళ్ళూడిచి కళ్ళాపేస్తే నే ముగ్గు పెడతాను. అది అంట్లు తోమితే కడుగుతాను. తర్వాత గదులు నేనే వూడుస్తాను. మజ్జిగ మా అమ్మే చేస్తుందనుకో. ఒక్కొక్కసారి నేనుకూడా చేస్తాను.

మొహం కడుక్కోవాలి. పొయ్యిదగ్గిర కాస్తో కూస్తో పని వుంటుంది. ఇవన్నీ ఎప్పుడౌతాయి ఆలస్యంగా లేస్తే? మేం బస్తీవాళ్ళలా అన్నిటికీ పని మనుషుల్ని పెట్టుకోము. ఇంట్లో ఆడవాళ్ళముండి ఏం చెయ్యాలి? ఐనా పొద్దెక్కేవరకూ పడుకోబుద్ధికాదు- ఆఁ, నువ్వు మొహం కడుక్కుంటావా? ఇంకాస్సేపు పడుకుంటావా?" అంది తులసి నవ్వుతూ.

"మళ్ళా పడుకుంటే నువ్వూరుకోవులే, పద."

"ఐతే బ్రష్ అదీ వుంటుంది కాబోలు తెచ్చుకో, నీ పెట్టె ఇక్కడే వుంది."

"తీసుకురాలేదు. ఇక్కడున్నప్పుడన్నీ ఇక్కడి పద్ధతులే."

"అయితే బట్టలు తెచ్చుకో, నీళ్ళు కాగివున్నాయి. లేకపోతే నా పరికిణీలు కట్టుకుంటావా?"

"అవి నీకే బావుంటాయి తులసీ!" బట్టలు తీసుకుని కిందకి వెళ్ళింది ఇందిర తులసితో.

వేపచెట్టుకింద దడిదొడ్లో స్నానంచేసి గదిలోకొచ్చి చీర కట్టుకుంటూంటే, తులసి వుప్మా, కాఫీ తీసుకొచ్చింది యిద్దరికీ.

"పొద్దుటే ఎందు కిదంతా? నా గురించి అర్భాటమేమీ వద్దు తులసీ! నేనూ మీలానే వుంటాను" అంది ఇందిర నొచ్చుకుంటున్నట్టు.

"అబ్బే! అర్భాట మేముందీ? మావయ్య కెలాగూ చెయ్యాలికదా!"

"అన్నట్టు కృష్ణమోహన్ ఇంకా లేవలేదూ? అతనినీ రానివ్వక పోయావా?"

"ఆయనగారు నిక్క నీలిగి వచ్చేసరికి మనపని ఖాళీ! తిందూ! అన్నట్లు ఈ అరటిపండు ముందు తిను. ఇది నా తులసి ప్రసాదం."

"నువ్వు తులసి పూజ చేస్తావా? కోట ఎక్కడుందీ?"

"పడమటి దొడ్లోవుంది. చూపిస్తాను. కాఫీ చల్లారిపోతూంది." తులసి హెచ్చరించటంతో ఇందిర తిండి కుపక్రమించింది. కాఫీ మాత్రం డబుల్ స్ట్రాంగుగా వుంది.

కృష్ణమోహన్ ఆవలిస్తూ వచ్చాడు— "ఏమి టేమిటీ! ఇంత ప్రొద్దుటే ఇందిరాదేవి లేవటం-స్నానం-టిఫెన్ అన్నీ, ఆశ్చర్యంగా వుందే!" ఆశ్చర్యపడ్డాడు.

"తులసి సావాసం" నవ్వింది ఇందిర కాఫీ తాగుతూ. "నిన్ను చూసి తులసే మారిపోతుందనుకున్నాను. తులసిని చూసే నువ్వు మారుతున్నా వన్న మాట. సరే! తులసీ! నీ అలవాట్లన్నీ ఇందిరకు నేర్పెయ్. ముందు ముందు పనికొస్తాయి" అన్నాడు కృష్ణమోహన్ ఇందిర మొహంలోకి చూస్తూ. ఇందిర చూపు తిప్పుకుంది.

"నా అలవాట్లేమున్నాయిలేమావయ్యా! రెండేసి పళ్ళేలుతినటమేగా?"

"ఇందిరా! దీనికి కోపం జాస్తి! నోరు జారిందో పీకపట్టేసు కుంటుంది నేనూ స్నానంచేసి వస్తా" కృష్ణమోహన్ వెళ్ళాడు.

తులసి గ్లాసులూ, ప్లేట్లూ తీసుకువెళ్తూ ఇందిరని కూడా రమ్మంది. ఇందిర తులసికోట దగ్గర నుంచుని దొడ్డంతా చూసింది. దొడ్డి చాలా విశాలంగా వుంది. నాలుగైదు నారింజ చెట్లూ, కరివేపాకు చెట్టూ, రెండు మూడు వేప మొక్కలూ వున్నాయి. బంతిచెట్లు విపరీతంగా వున్నాయి దొడ్డినిండా. వంట పాకమీదికి పాదులు దట్టంగా అల్లుకున్నాయి. కొన్ని పాదులు పందిరి మీద కూడా పాకివున్నాయి. అరటి చెట్లు కూడా చాలా వున్నాయి. వర్షాకాలం కావటంచేత దొడ్డంతా బురదగా వుంది.

అప్పన్న కోడిపుంజుని తరిమి తరిమి పట్టుకుంటూంటే నూతి గట్టు మీద మొహం కడుక్కుంటూ అడిగాడు కృష్ణమోహన్- "ఏమిట్రోయ్ అప్పన్నా! ఎందుకదీ?"

"బస్తీలో అలసిపోయి వచ్చావు. విందు చేద్దామని" అంది తులసి గ్లాసులు కడిగి తీసుకెళుతూ.

"పేరు నాదీ, తిండి నీదీ లే. కానీ ఆవిడ మాంసం తినదు. అనవసరంగా దాని ప్రాణం తియ్యకండి. కోడి గుడ్లయితే ఎన్నైనా వేయించు. మరేం అభ్యంతరం లేదు" అన్నాడు కృష్ణమోహన్.

"నిజం? నువ్వు మాంసం తినవూ?" అంది తులసి దగ్గరకొస్తూ ఇందిరతో.

"నిజమే, మానేశాను" అంది ఇందిర.

అప్పన్న ఏమీ పట్టించుకోకుండా పుంజుని దొరకబుచ్చుకుని, "మహా తిప్పలు పెట్టేశావు గదే. ఇప్పుడు నిన్నేంచేస్తానో తెలుసా?" అన్నాడు కసికొద్దీ.

"ఆ తెలుసు. వదిలేస్తావ్. చాల పాటుపడ్డావుగానీ, ఆవిడ మాంసం తినదట. వదిలెయ్" అంది తులసి నవ్వుతూ. అప్పన్న తెల్లబోయాడు. పుంజు చేతుల్లోంచి జారి పరిగెత్తింది.

"నాకు కాస్త పనుంది. ఇక్కడ కూర్చుంటావా? నేనూ తొందరగా వచ్చేస్తాను." అంది తులసి ఇందిరతో. ఇందిర గదిలో కెళ్తూంటే తులసి వెనక్కి పిల్చి, కిటికీలో పోసివున్న కనకాంబరాలు తెచ్చిస్తూ "పొద్దుటే కోశాను. కట్టడానికి తీరిక లేకపోయింది. పైకి వెళ్ళి మాల కడ్తూ కూర్చో. దారం కూడా పీటిలో వుంది." అంది.

ఇందిర పూలు చెంగులో పోసుకు పైకెళ్ళి, మంచం కిటికీ దగ్గరికి లాక్కుని కూర్చుంది మాల కడుతూ. కాస్సేపటికి కృష్ణమోహన్ స్నానం చేసి కాఫీ తాగుతూ పైకి వచ్చాడు వస్తూనే అడిగాడు - "ఎలా వుంది ఇల్లు? నచ్చిందా? కాబోయే కోడలికి ఇల్లు నచ్చకపోతే గొడవవొస్తుంది."

ఇందిర కృష్ణమోహన్ మొహంలోకి చూసింది. తక్షణం-"ఏమిటిది? ఎవరైనా వింటే ఏమనుకుంటారు?" అంది మందలింపుగా.

"ఏమనుకుంటారు? కాబోయే దంపతులు కబుర్లాడుకుంటున్నారనుకుంటారు" అన్నాడు, కిటికీ రెక్కలు మూసి మంచం మీద కూర్చుంటూ.

ఇందిర లేచి కిటికీ తెరచి కిటికీ కానుకు నుంచుని అంది-"నీ ధోరణి నాకేం బాగులేదు. ఎప్పుడో జరిగితే జరగొచ్చు. అస్తమానూ అదే సోదేమిటీ? నాలుగు రోజులుండి పోదామని వచ్చాను. గౌరవంగా ఉండనీ, అల్లరిపాలు చెయ్యకు నన్ను."

"ఛ, ఎందుకంత భయం ఇందూ? ఈ ఇల్లు నీది. నువ్వు అల్ల రెందుకు పడతావు? ఏ క్షణాన్నైనా మా అమ్మతో నా కోరిక వెల్లడించ డానికి సిద్ధంగా ఉన్నాను. ఎప్పుడో జరగబోయే వాస్తవాలని ఇప్పుడే వూహించు కోవటంలో ఎంతానందముంటుందో తెలుసా? సరేలే, నే వెళ్తాను. మా స్నేహితులెవర్నీ కలుసుకోలేదు. తులసిని పంపిస్తాను" అంటూ కృష్ణ మోహన్ మెట్లుదిగి వెళ్తావుంటే తులసి హడావిడిగా యిద్దరాడవాళ్ళను వెంటేసుకుని ఎదురుపడింది. అందులో ఓ ముత్తయిదువ హాస్యంగా అంది, ఎదురొచ్చే కృష్ణమోహన్‌తో-"చూశావ్‌రా కృష్ణా! ఎంతైనా కాబోయే మొగుడివికదా? ఇది సిగ్గుపడటం, తొలగడం ఏమైనా వుందేమో చూడు?"

"ఛ, పో అత్తా" తులసి బుంగమూతి పెట్టి నుంచుంది.

కృష్ణమోహన్ నవ్వాడు "పాపం సిగ్గుపడుతూనే వుందికదూ పెద్దమ్మా! ఇక తొలగటం అంటావా? మనిషంత మనిషి నల్ల పూసెలా ఐ పోతుంది చెప్పూ?- దానికేం గానీ యింత పొద్దుటే...."

"బళ్ళో పిల్లెవరో వచ్చిందటగా, చూద్దామని...." అంటూ వాళ్ళంతా పైకి వెళ్ళారు. ఇందిర మాల చెరిసగం చేస్తూ కూర్చుంది.

"నిన్ను చూద్దామని వచ్చారు మా అత్తావాళ్ళు" అంది పైకి వెళు తూనే తులసి ఇందిర మర్యాదగా లేచి నుంచుంది - "నన్ను పిలిస్తే నేనే వచ్చేదాన్ని కదూ? కూర్చోండి." వాళ్ళిద్దరూ మంచంమీద కూర్చున్నారు. ఇందిరని నిశితంగా పరిశీలిస్తూ. తులసి వెళ్ళిపోయింది.

వాళ్ళిద్దరూ ఇందిరని ప్రశ్నల్లో ముంచేశారు- "మీ నాన్నగారి కేం పని? మీ అన్నదమ్ము లెంత మంది? చదువయ్యాక ఉద్యోగం చేస్తావా? పెళ్ళి చేసుకునేదానికింత చదువెందుకూ? మీకెంతాస్తి ఉంటుందీ? బస్తీ వాళ్ళకి పొరుగూళ్ళు పంపటానికి పట్టింపు వుండదనుకుంటా?" ఇలా ఇలా దాడిచేసిన ప్రశ్నలకి సాధ్యమైనంతవరకూ వినయంగా జవాబులు చెప్పింది ఇందిర. 'అమ్మలక్కలంటారు, ఇలాంటి వాళ్ళనే కాబోలు' అనుకుంది.

"ఐతే అమ్మాయ్! పల్లెటూళ్లో ఏం చేస్తావూ?" అంది ఒకావిడ.

ఇందిర కాస్సేపు తటపటాయించి- "పంటపొలాలూ- పళ్ళతోటలూ అవీ...." నసిగింది.

రెండో ఆవిడ ఫకాలున నవ్వింది- "ఇన్నేళ్ళుగా కాపురాలు చేస్తున్నాంగానీ ఒక్కసారీ పొలాలకేసి వెళ్ళలేదు. ఏంవుంటుందీ చూట్టానికీ.... ఇక వెళదామే" అంటూ లేచింది. వాళ్ళతో ఇందిర కూడా కింద కొచ్చింది. వాళ్ళిద్దరూ అన్నపూర్ణమ్మతో ఏదో మాట్లాడి వెళ్ళిపోయారు. ఇందిర వంట పాకలోనే కూర్చుంది చాలా సేపు.

పది గంటలకి పిండి వంటలతో భోజనం, మధ్యాన్నం ఫలహారం, పూర్తయ్యాయి.

"ఇవ్వాళ చేలమీది కెళదాం. తొందరగా తెమలండి" అన్నాడు కృష్ణమోహన్.

"జాగ్రత్తగా వెళ్ళండి వాన కురిసిన గట్లు బురదగా ఉండి-జారిపోతాయి. బోదెలవీ దాటేటప్పుడు- తులసీ! ఇందిర చెయ్యి పట్టుకు జాగ్రత్తగా తీసుకెళ్ళు. తొందరగా వచ్చెయ్యండి ! జాగ్రత్తసుమా ! కాలుజారితే బెణుకుతుంది." అంటూ అన్నపూర్ణమ్మ పదే పదే హెచ్చరించింది.

★ ★ ★ ★

వానకి నాని కాలేస్తే జారిపోతున్న గట్లమీద నడవటం కష్టంగా ఉంది ఇందిరకి. పాదాల మీద పడే కుచ్చెళ్ళు చేతుల్తో పట్టుకుని, బొటన వేళ్ళు బురదలోకి గుచ్చి నెమ్మదిగ నడవసాగింది. తులసి నిర్భయంగా కుచ్చులూపుకుంటూ జోరుగా నడిచి పోతోంది ముందు. కృష్ణమోహన్ ఇద్దరి వెనక మాటమాటకి ఇందిరని హెచ్చరిస్తూ వస్తున్నాడు.

కనుచూపు మేరలో పచ్చటి పొలాలు అనుతున్నాయి- "ఆ బోది దాటితే చేల మధ్య పడతాం" అన్నాడు కృష్ణమోహన్. పది బారలు నడిచేసరికి బోదె రానే వచ్చింది. తులసి అవలీలగా దూకేసి అవతలిగట్టున నించుంది యెదురుచూస్తూ. ఇందిర తటపటాయిస్తూ ఆగిపోయింది "అవతలి గట్టు జారుడుగా వుంది. దూకేసరికి కాలు జారిపోదూ?" అంది భయంగా.

"నీతో బలేచిక్కే. బస్తీపిల్లకి పల్లె విహారాలెందుకో?.... ఊఁ....చెయ్యి అందించు. నెమ్మదిగా రా" అన్నాడు కృష్ణమోహన్ అవతలి గట్టుమీద నుంచి చెయ్యిచాస్తూ.

ఇందిర తటపటాయించింది. "అదేమిటి, నుంచుని చూస్తావ్? చెయ్యి

అందించు" అంది తులసి. ఇందిరకి తప్పలేదు. చెయ్యి అందించింది-కృష్ణమోహన్ అందుకుని దాటిస్తూ "చేతగాకపోయినా సిగ్గెక్కువే పిల్లకి.... పట్టుకుని నడిపిస్తాను, పద" అన్నాడు చెయ్యి వదలకుండా. తులసినవ్వింది.

"అక్కర్లేదు. విడు"-అంటూ విడిపించుకుంది ఇందిర.

"సరే, ఇంతకన్నా పెద్ద బోదులున్నాయి ముందు. అప్పుడు "నే నసలుపట్టుకోను" అన్నాడు కృష్ణమోహన్.

"నే పట్టుకుంటాను" అంది తులసి నవ్వుతూ.

సన్నటి గట్టుకి రెండు వైపులా గుండెల వరకూ తాకే పచ్చటి వరి చేలు! ఎంత లెక్క చూసినా సమతలంలో కన్నుల పండుగ చేసే పరచిన కంబళీ! పంట చేలని అంత దగ్గరగా చూడటం అదే తొలిసారి. తీవ్రత తగ్గిన పడమటి సూర్యకిరణాలు పచ్చటి వరి వెన్నుల మీదా, కంకుల మీదా పడి మిలమిలా మెరుస్తున్నాయి. చల్లగాలికి చేనంతా మృదువుగా ఊగుతూ అతిథుల్ని ఆహ్వానిస్తోంది. ఇందిర, కుచ్చెళ్ళు వదిలేసి రెండు చేతులూ వరి కంకుల మీదనుంచి పోనిస్తూ నడువసాగింది.

"అరె, ఇందిరా! చేతులు తీసేయ్. వరి ఆకులు వాడిగా వుంటాయ్. చేతులు తెగుతాయ్!" అన్నాడు కృష్ణమోహన్ ఆదుర్దాగా. ఇందిర నిర్లక్ష్యంగా నడుస్తూ బురదలో కుచ్చెళ్ళు అడ్డుపడి తూలింది.

"అబ్బబ్బ, చెప్తే విన్పించుకోవు. మెయిన్ రోడ్డులో నడిచినట్టుగా నడవకపోతే కాస్త ఆ చీర చేత్తో పట్టుకోరాదూ? తులసి చూడూ! ఎలా దూసుకు పోతోందో?"

నిజమే! తులసి పాదాలకంటని పొట్టి పరికిణీ చేత్తో పట్టుకోనవసరం లేదు త్రాచులాంటి జడని ముందు కేసుకుని కుచ్చులు వూపుకుంటూ పోతూంటే గాజులు గలగలా, మువ్వల పట్టాల మృదువైన చప్పుడూ కలిసి మనోహరంగా పంటచేల మధ్య వనలక్ష్మి పరుగెడుతోందేమో ననే భ్రమ పుడుతోంది.

"నాలాంటి బస్తీవాళ్ళకి ప్రకృతిలో చోటు లేదేమో! ఎంత కలిసినా ఎరువుగానే వుంటుంది" అనుకుంది ఇందిర.

ఈసారి పెద్ద బోదిమీద తాటిపట్టెంకూడా ఉంది. తులసి దాటేసి వెళ్ళిపోయింది. ఇందిరకి దానిమీద నడుస్తూంటే కాళ్ళు గజగజా వణికాయి. భయంతో కృష్ణమోహన్ భుజం గట్టిగా పట్టుకుంది- "వదులు, నన్నంటు

కోకు." అన్నాడు అతను మధ్య కొచ్చాక వదిలించుకుంటూ. ఇందిర బెరుగ్గా వదలకుండా పట్టుకుంది. "నీ అవసరమా ఇది?" అన్నాడు ఇందిర మొహంలోకి చూస్తూ. ఇందిర మౌనంగా ఇవతలి గట్టుకొచ్చి అంది విసుగ్గా. "ఇవన్నీ వుంటాయని తెలిస్తే రాకపోదును"—

"తులసీ! అమ్మ దగ్గరుండి తీసికెళ్ళమని చెపితే నువ్వలా ముందు ముందు పోతావేం? ఇందిర రాదట"—

కృష్ణమోహన్ తులసిని కేకేశాడు.

"నువ్వున్నావుగా, నేను తాటి తోపులో కూర్చుంటాను వెళ్ళి" అంది దూరంగా వున్న తులసి.

"నాకాళ్ళు నొప్పు లెడుతున్నాయి. ఇంకెంత సేపు?" అంది ఇందిర.

"రెండు మైళ్ళు మాత్రమే నడవవలెను. పది బోదులు దాటవలెను" అన్నాడు కృష్ణమోహన్.

ఇందిర నవ్వి అంది "ఫర్వాలేదు కానీ, ఎకరం అంటే ఎంత వుంటుంది?"

"మనం వచ్చినదంతా తులసి పొలం. చూడూ! మొదటిబోది దగ్గర్నుంచీ ఆ కనపడే తాళ్ళ వరకూ ఎనిమిదెకరాలు. ఎకరం అంటే సుమారుగా యిటువంటి పెద్ద పెద్ద మడులు నాలుగౌతుంది."

"ఎకరానికెన్ని బస్తాలు పండుతుందీ ?"

"పొలం బలాన్ని బట్టి. ఇప్పుడీ లెక్కన వెన్నుపడితే ఎకరానికి రెండు పుట్లు - అంటే యిరవై బస్తాలు యీజీగా రాల్తుంది ధాన్యం. తులసి పొలం యెప్పుడూ బాగానే పండుతుంది. అదిగో తులసి! ఎలా కూర్చుందో తాళ్ళకింద !"

ఇందిర వెళ్ళి తులసి పక్కన కూర్చుంది-"ఇక్కడీ చెరువేమిటి?" అంది పరిసరాలు చూస్తూ.

"ఇది ఆకుమళ్ళ చెరువు. అంటే వరి విత్తనాలకి ఈ నీరు సరఫరా అవుతుంది. చేలకి వేరే కాలవ నీరు వస్తుందనుకో?"-అన్నాడు కృష్ణమోహన్ బాగా వంగిన తాటిమీద కూర్చుంటూ.

చెరువుకి ఇందిరావాళ్లు కూర్చున్న గట్టు తూర్పు వైపుది. ఎత్తుగా పరిశుభ్రంగా వుంది. గట్టు పొడుగునా, చెరువుచుట్టూ తాటి చెట్లు. అందుకే అది తాళ్ళతోపు ! తాళ్ళతోపులో ఆకుమళ్ళ చెరువు! చెరువునిండా పరిచిన

తామరాకులూ ! తాళ్ళ నీడలూ !

"మామయ్యా ! మొన్న మొన్నటి వరకూ తాటికాయలు తెగ తినేశాం నేనూ - అప్పన్నా. అమ్మ తిడుతూనే ఉండేది. వాడు చాటుగా తేవటం; నేను దాలిగుంటలో కాల్చటం. ఒక్కోసారి అమ్మని బ్రతిమాలి రొట్టెలు కాల్పించేదాన్ని. టెంకలన్నీ దొడ్లో పాతర వేయించాను కూడా. అప్పన్న రోజూ బుర్రగుంజు కొడతానంటాడు. నేనే విన్పించుకోవటంలేదు. రేపు కొట్టించుకుందామా ?" అడిగింది తులసి మావయ్యని.

కృష్ణమోహన్ ఇందిరను చూస్తూ అడిగాడు - "బుర్రగుంజు ఎప్పుడైనా తిన్నావా? ఇష్టమేనా ?"

"ఏమో అదెలా వుంటుందో నే చూడలేదు" అంది ఇందిర చెర్లోకి చూస్తూ.

"పొరపాటైపోయింది మావయ్యా ! బట్టలు తెచ్చుకుంటే స్నానం చేసే వాళ్ళం"అంది తులసి,లేచి వెళ్ళిరేవులో తాటిపట్టీలమీద కూర్చుని, కాళ్ల నీళ్ళలో పెట్టి ఆడిస్తూ. నిశ్చలంగా వున్న నీటిలో చిన్న చిన్న అలలు లేస్తున్నాయి. అలలమీద పడ్డ సూర్యకిరణాలు తులసి మొహంమీద ప్రతిఫలిస్తున్నాయి. పరిశుభ్రమైన నీటిలో తులసి మువ్వలపట్టాలు పద్మంలా కదలటం చూస్తూ కూర్చుంది ఇందిర.

"మొన్న నాగులచవితికికూడా ఇక్కడే స్నానం చేసి ఆ పుట్టలో పాలుపోశాం" అంది తులసి లేచివస్తూ.

ఇందిర పుట్టకేసి చూచి హడలిపోయింది - "ఏమిటీ? ఇది పుట్టా? ఇందులో పాము లుంటాయా? ఎంత పెద్దదో!" అంది భయంగా, ఆశ్చర్యంగా.

"ఎందుకంత భయం? మనకేం ఫర్వాలేదులే కూర్చో ! అన్నట్లు, నువ్వెప్పుడైనా బట్టలతో చెర్లో స్నానం చేశావా?" అడిగాడు కృష్ణమోహన్.

"ఛ! అంత పబ్లిగ్గా స్నానం యెలా ?" అంది ఇందిర నుదురు చిట్లిస్తూ.

"భలేది మావయ్యా ఇందిర! చెర్లో స్నానం బావుండదట!"

"అందుకే రేపు తోటలో చెరువులో చేయిద్దాం. ఇక్కడొద్దు. కొత్త వాళ్ళకి లోతుగా వుంటుంది ఈ చెరువు."

"నే చెయ్యను బాబూ! అంత బాహాటంగా స్నానం చెయ్యటం

ఇష్టంలేకే పుష్కరాలకి మా వాళ్ళంతా రమ్మంటే వెళ్ళలేదు" అంది ఇందిర.

"ఇదేం స్నానం కాదు, జలవిహారం. రేపు చూద్దువుగానిలే."

"ఇక పోదాం మావయ్యా! పొద్దుపోతోంది"

రాను రాను చీకటి అలుముకుంది. అంత మనోహరమైన ఆ పరిసరాలని విడిచి వెళ్ళాలనిపించలేదు ఇందిరకి.

"మరోసారి వద్దాంకదూ?" అన్నాడు కృష్ణమోహన్ లేస్తూ. తులసి ఇందిర చెయ్యి పుచ్చుకుని నెమ్మదిగా నడిచింది.

మర్నాటి సాయంత్రం తోటషికారుకు సన్నాహం.

"బట్టలు తెస్తున్నారా స్నానానికి?" అన్నాడు కృష్ణమోహన్.

"చెరువెలా వుంటుందో యివ్వాళ చూసి రేపు చేద్దాం—అంటున్నది ఇందిర. కానీ మామిడిచెట్టుకు వుయ్యాల వెయ్యటానికి పలుపులు తెస్తున్నాడు అప్పన్న" అంది తులసి.

"ఏం? ఇందిరాదేవికి ఉయ్యాలమీదకి మనసు మళ్ళిందా?"

"నాకేం తెలీదు. తులసి చెప్తే నేనూ వూరుకున్నాను."

"సర్దాగా చెరువులో ఆడుకుందామంటే కేన్సిలుచేసి పారేశావా? మీ బాత్‌రూంకంటే బాగా ఉంటుంది తోటలో చెరువు!"

"ఐనా ఈ వర్షాకాలం చెరువులో స్నానాలేమిటి? జలుబు చేస్తుంది. తోటలో కాస్సేపు కూర్చుని వచ్చెయ్యక" మందలించింది అన్నపూర్ణమ్మ.

"మావయ్యా! తోటలో తినటానికి మంచి టిఫిన్ తయారుచేశాను" అంది తులసి.

"మంచిదానివిలే. అవన్నీ అప్పన్న తెస్తాడు కానీ త్వరగా తెమలండి."

సాయం సమయం తోటలో తిరగటం బలే సర్దాగా ఉంది. విశాలమైన మామిడితోట! ప్రశాంతమైన వాతావరణం! దగ్గర దగ్గరగా పెరిగిన మామిడి చెట్లు! పై భాగాన ఒకదాన్నొకటి అందుకోబోతున్న పొడుగాటి కొమ్మలు! వర్షాలకు ముదురెక్కిన ఆకు గుబుర్లు! చెట్లుకింద రాలి నానుతూన్న పండుటాకులు! రెండు రోజుల్నుంచి వానలేక గట్టిపడిన కాలిదార్లు! కింద నుంచి నడుస్తూంటే తలకి తగిలే ఆకుల్ని చేత్తో తుంచుతూ ఉల్లాసంగా నడుస్తోంది ఇందిర. ఏ చెట్టుచూసినా భూమిమీదకి వంగిన కొమ్మలతో తల నిమురుతూ ఇక్కడే వుండమని అర్థిస్తున్నట్టే తోచింది ఇందిరకి- "ఈ

కొమ్మలెంత కిందకున్నాయో! వీటిమీద కాస్సేపు కూర్చుందాం” అంది ఇందిర కృష్ణమోహన్‌ని చూస్తూ.

“తోటంతా చూడాలి; ఉయ్యాలూగాలి, చెరువు గట్టుమీద కూర్చుని ఫలహారం తినాలి. ఇవన్నీ ఎప్పుడూ, ఇక్కడ కూర్చుంటే?” అంది తులసి కలగ జేసుకుని.

“తులసికి నచ్చకపోతే లాభం లేదు. వచ్చేటప్పుడు కూర్చుందాంలే ఇందిరా!” అన్నాడు కృష్ణమోహన్ ముందుకు నడుస్తూ.

అప్పుడే వచ్చి తమలో కలుసుకున్న అప్పన్నకి పురమాయించింది తులసి- “మాతో యెందుకూ? చెరువు గట్టుమీద మామిడి చెట్టుకి ఉయ్యాళ్ళువేసి, ఆ పొట్లం చెట్టు మొదట్లో పెట్టి నువ్వాటు కొబ్బరిమడిలోంచి వెళ్ళిపో. ఇంటిదగ్గర పనుంటుంది.”

అప్పన్న తాళ్ళు భుజంమీద వేసుకు వెళ్ళిపోయాడు.

ముగ్గురికీ తోట షికారులో చాలా చాలా కబుర్లు దొర్లిపోతున్నాయి.

“పళ్ళ కాలంలో - అంటే వేసవికాలం, తోటని అమ్మేస్తాం. కొనుక్కున్నవాళ్ళే శ్రద్ధగా కాపలా కాయిస్తారు. మనకి కొన్ని వందల కాయాలూ, పళ్ళూ ఇస్తారు. తర్వాత తోట మనకే అప్పజెప్పుతారు. ఈ తోట సరిగా వయసులో వుందన్నమాట మీ యిద్దరిలా. కాని కొన్నేళ్ళకి కొత్త మొక్కలు నాటుతుండాలి. ముదురు చెట్లుడిగిపోతే లేత చెట్లందు కుంటాయి” కృష్ణమోహన్ చెప్పుకుపోతూంటే “గట్టుమీద— ఉయ్యాల నాది ఇందిరా! నీకూ నాకూ పోటీ!” అంటూ పరుగెత్తింది తులసి.

“ఇదేనా మీరు చెప్పిన చెరువు?” అంది ఇందిర. పరిసరాలు పరిశీలిస్తూ రెండో ఉయ్యాల అందుకుంది.

కృష్ణమోహన్ చెరువుగట్టు మీద చెట్టు మొదట్లో నుంచున్నాడు, రెండు ఉయాళ్ళూ చూస్తూ.

తులసి ఉయ్యాల దాదాపు చెరువు మధ్యలోకి వెళ్ళి వస్తున్నది. కాళ్ళ వేళ్ళు ఎత్తయిన ఆకుల్ని అందుకుంటున్నాయి. అంత విసురుగా వూగటం ఇందిరకు చేతకాలేదు. నెమ్మదిగా వూగుతూ బాణంలా దూసుకుపోతున్న తులసి ఉయ్యాలని చూస్తూ కూర్చుంది.

“పాపం ఇందిరకి చేతకావటంలేదు తులసీ! నే వూపుతాను నీతో సమానంగా” అంటూ కృష్ణమోహన్ ఇందిర వారిస్తున్నా విన్పించుకోకుండా

బలంగా వూపసాగాడు. నాలుగైదు వూపులవరకూ వుగ్గపట్టుకు కూర్చుని అంత విసురుకి తమాయించుకోలేక వుక్కిరిబిక్కిరైపోయింది ఇందిర.

"బాబోయ్! చాలు! ఆపు! ఆపు!" అంటూ భయంగా కెవ్వుమని అరిచింది. ఉయ్యాల ఆగీ ఆగగానే ఇందిర తాళ్ళు వదిలేసి కింద కూర్చుండి పోయింది, కళ్ళు మూసుకుని.

"ఏమైంది ఇందిరా! భయమేసిందా!" ఒంగుని అడిగాడు కృష్ణ మోహన్.

"కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి? కడుపులో వికారంగా, దడగా వుంది. ఆపమని గోలెడుతోంటే విన్పించుకోవు. అంత మోటు మనిషివేం?" విసుక్కుంది కళ్ళు చేతుల్తో మూసుకుంటూ.

"కొత్తవాళ్ళ కలాగే వుంటుంది మావయ్యా! రేవులోకి తీసుకెళ్ళి మంచినీళ్ళు పట్టించు" అంది జోరుగా వూగుతూ తులసి. కృష్ణమోహన్ ఇందిరను సముదాయించాడు- "నన్ను తరవాత నీ ఇష్టం వచ్చినట్టు తిడుదువుగానీ కాస్త తేచి నడుస్తావా? మంచినీళ్లు తాగితే వికారం పోతుంది."

ఇందిర రేవులో వేసిన కొయ్యమీద కూర్చుని మొహం కడుక్కుని మంచినీళ్ళు తాగింది. "అబ్బా! ఎంత భయం వేసింది? పడిపోయా నను కున్నాను" అంది కోపంగా.

"అమ్మో! పడిపోనిస్తానా? పట్టుకుంటానుగానీ - తులసి చూడూ! ఎంత ధైర్యంగా వూగుతోందో?"

ఇందిరదృష్టి మనోహరమైన చెరువుమీదికి పోయింది. పెద్దదీ చిన్నదీ కాని చెరువు! చెరువుచుట్టూ గోళాకారంలో లేత మామిడిచెట్లు! చెరువు మీదికి వంగిన కొమ్మలు! ప్రశాంతమైన నీటిలో ప్రతిబింబించే కొమ్మల నీడలు! వర్షాలు పడి జేగురు రంగుతేలిన నీరు! చెరువులో పల్చ పల్చగా తేలుతూన్న తామరాకులు! ప్రొద్దుటే విచ్చి వాడి పోయిన తామరపూవులు! అబ్బా! ఎంత ఆహ్లాదంగా వుంది! విశాలమైన తోటా, ప్రశాంతమైన చెరువూ!

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ఇందూ?"

"ఈ తోటా, ఈ చెరువూ ఎంతో బావున్నాయి. పట్నంలో ఎన్ని పార్కులైతే మాత్రం ఈ శోభ వస్తుంది?"

"అవును. ఈ ప్రకృతి దృశ్యాలన్నీ చూడటానికి కళాదృష్టివుండాలి.

కాని ఇందూ! ఇంత మనోహరమైన ఈ చెరువులో మనం జంటగా విహరిస్తే మరీ బావుంటుంది కదూ?" కృష్ణమోహన్ ఇందిర కన్నులలోకి చూడబోతే ఇందిర చూపు తిప్పుకుని అంది- "ఛ, తులసి వింటుంది."

తులసి ఉయ్యాల వదిలేసి గజ్జెల గుర్రంలా పరుగెడుతూ వచ్చింది- "మీ నీడలు నీళ్ళల్లో జతకన్పిస్తున్నాయి. మీ మధ్య నేనూ! జరగండి- జరగండి"అంటూ చొరవగా ఇద్దరి భుజాలమీద చేతులేసి ఇద్దర్నీ దూరంచేసి మధ్యలో కూర్చుని అంది. "చూడు మావయ్యా! నా నీడకూడా పడింది-"

"అవునులే. నువ్వు లేకపోతే చెరువు చిన్నబోదూ?" నవ్వాడు కృష్ణ మోహన్.

"నువ్వు వెటకారంగా అన్నావేమోగానీ నిజమంతే — ఆఁ, ఇందిరా ఈ పొట్లం ఏమిటో చెప్పుకోగలవా?"

"చెప్పుకోకపోతే నీకు లేదు" అన్నాడు కృష్ణమోహన్.

"నాకు పెట్టకపోతే మీకు అరగదు లెండి. కాస్త ముట్టుకుని చెప్తాను." అంది ఇందిర నవ్వుతూ.

"ఓ, వాసనకూడా చూడొచ్చు." అంది తులసి. ఇందిర పొట్లం నలిపి నలిపి బాగా శల్యపరీక్ష చేసిందిగాని చెప్పుకోలేకపోయింది. "విప్పితే చూసి చెప్పుకుంటాను." అంది చివరకి చిలిపిగా.

తులసి పొట్లం విప్పింది. ఇందిర ఎంతాలోచించినా చెప్పుకోలేక పోయింది.

"నువ్వు మావయ్యా!" అంది తులసి.

"ఓస్! నాకు తెలీనట్లు చెప్పకు. నేనేం బస్తీ పిల్లని కాదు. ఇది బుర్రగుంజు."

"నిన్న చెప్పింది ఇదేనా? మర్చిపోయాను. ఎప్పుడూ చూడందే ఎలా తెలుస్తుందేం?"

"రేపు మరో తాయిలం. పట్టండి." అంటూ తులసి బుర్రగుంజు పంచింది.

"నీ తాయిలాలు తినలేక చస్తున్నాను. వచ్చిన దగ్గర్నుంచి ఒకటే తిండి. ఈ లెక్కన తింటే పీపాలా అవుతాను. రేపు వెళ్ళిపోతాను బాబూ!" అంది బుర్రగుంజు తింటూ ఇందిర.

"ఆవు ఈనాలి, జున్ను తినాలి, జున్నుపాలు తాగాలి. అప్పుడూ

తెళ్ళటం" అంది తులసి, చిన్న ముక్క చెర్లోకి విసురుతూ. నిశ్చలంగా వున్న నీటిలో చిన్న చిన్న అలలు లేచాయి.

"ఛ. ఎందుకలా అల్లకల్లోలం చేస్తావ్!" మందలించాడు కృష్ణ మోహన్.

"చేపలు తినటానికి పైకొస్తాయి, చూస్తుండు." మరో ముక్క విసిరింది తులసి నీళ్ళలోకి.

"నీళ్ళు కదులుతూంటూనే బావుంటుంది. సూర్యకిరణాలు పడి మిలమిల్లాడుతాయి," అంది ఇందిర అలలను చూస్తూ.

"సరిపోయింది. ఇద్దరికీ నిశ్చలంగా వుండడం ఇష్టంలేకపోతే తన్నుకోండి." నవ్వాడు కృష్ణమోహన్.

"మేమిద్దరం ఎప్పుడూ జట్టే. ఇద్దరం కలిసి నిన్ను....తన్నుతాం." ఫక్కు మంది తులసి. ఇందిర కూడా చాలా సేపు నవ్వింది. తులసి అన్నట్లు గానే నీళ్ళలోంచి ఓ చిన్న చేప పైకొచ్చి బుడుంగున మునిగిపోయింది. తులసి సంతోషంగా చప్పట్లు చరిచింది. దగ్గరున్నదంతా నీళ్ళలోకి విసిరే సింది. ఇందిర తనదగ్గర మిగిలింది కూడా ఇచ్చేసింది. కృష్ణమోహన్ ఇవ్వనన్నాడు.

"స్నానం చేస్తూంటే చేపలు కరవ్వూ?" అంది ఇందిర అకస్మాత్తుగా గుర్తొచ్చి.

"మన్ని కరవ్వు. మనం తింటానికి పెట్టాంకదూ? మావయ్యని కరుస్తాయి"

"ఓ, నాకేం భయంలేదు. వాటిని మచ్చిక చేసుకోటానికి నాకేంఖర్మ?"

"నువ్వు రాకు. రేపు మేమిద్దరం వచ్చి స్నానం చేస్తాం," అంది ఇందిర కృష్ణమోహన్‌తో.

"ఏమ్మా? నే నేం పాపం చేసుకున్నానూ!"

తులసి కిలకిలా నవ్వింది. ఇందిర చిన్నగా నవ్వింది.

"ఇక పోదాం," తులసి లేచిపోయింది.

"ఈ ఉయ్యాళ్ళు ఇలాగే ఉంటాయా?"

"మరేం ఫర్వాలేదు. ఆ పలుపుల్తో పని వచ్చేవరకూ ఇలాగే వుండి పోతుంటాయి" ఇందిర కొయ్యమీద నుంచి నీళ్ళలోకి కాళ్ళు జాపి అల్లలా

డించి లేచి నుంచుంది.

★ ★ ★ ★

మర్నాటి పొద్దుట ఇందిర నిద్రలేచి కిందికొచ్చేసరికి చావిట్లో వడ్లు దంచుతున్నాడు. ఇందిరని చూస్తూనే అన్నాడు అప్పన్న సంతోషంగా "మన ఆవు ఈనిందమ్మాయిగారూ! దూడ చూడముచ్చటగా వుందండీ!"

"ఏం దూడ? ఆడదా; మొగదా?" అడిగింది ఇందిర మెట్లుదిగుతూ.

"ఆడపిల్ల! అచ్చు నీలా వుంది. పేరు ఇందిర." దొడ్లోంచి చావిట్లోకొస్తూ అన్నాడు కృష్ణ."

"మధ్యలో నా పేరెందుకూ?"

"నువ్వొచ్చాకే నీలాంటి ఆడపిల్ల పుట్టిందిగదూ? కిందటి రెండీతలకీ మొగపిల్లలే."

తులసి హడావిడిగా చావిట్లోకొచ్చింది- "పాకలో కెళ్ళి నేను చూసి వచ్చాను ఇందిరా దూడని. బలేముద్దుగా ఉంది. నిన్నూ తీసుకెళతాను. దొడ్లోకెళ్ళి మొహం కడుక్కో గమ్మున. ఒరేయ్ అప్పన్నా! గంటనుంచీ దంచుతున్నావ్, ఇవ్వాల్టి కౌతుందా నీ దంపు? ఏం మావయ్యా? అప్పుడే వచ్చేశావేం పాకలోంచి? అప్పన్న వచ్చేదాకా వుండలేక పోయావా? కాకులన్నీ పొడుస్తాయి దూడని." అంటూ ఓసారి అందర్నీ అదమాయించేసి వెళ్ళిపోయింది. ఇందిర నవ్వుతూ దొడ్లో కెళ్ళింది.

ఇందిర మొహం కడుక్కున్నాక గొడ్లపాకలోకి తీసికెళ్ళింది తులసి.

ఆవు నుంచుని ముద్దలా పడుకునివున్న దూడ ఒళ్ళంతా నాకుతోంది. అప్పన్న దూడగోళ్లు గిల్లి ఆవునోటి కందిస్తున్నాడు. అది చూస్తుంటే ఇందిరకు కడుపులో దేవింది. దూడమాత్రం బలే ముద్దుగా వుంది. తెల్లటి తెలుపు! తోకమీద, నుదురుమీద నల్లటి మచ్చలు! అప్పుడే పుట్టిన దూడని తదేకంగా చూస్తూ నించుంది- "అదిగో! ఆ గేదెకూడా రేపోమాపో ఈనుతుంది. ఈ ఆవు బలే పాలిస్తుందిలే. ఇక పోదాం" అంటూ తీసికొచ్చేసింది తులసి.

మధ్యాహ్నానికి జున్ను తయారైంది. ఇరుగు పొరుగులకీ, మొహమాటస్తులకీ జున్ను పెట్టడం ఐంది మూడు గిన్నెలతో జున్ను తీసుకు పైకొచ్చింది తులసి.

"గంట క్రితం కడుపునిండా అన్నంతిని ఇప్పుడీ గిన్నెడు జున్నూ

తినాల్సిందే! అంత వద్దు. కాస్త నువ్వు తీసుకో తులసీ!" బ్రతిమాలింది ఇందిర.

"అదేం వీల్లేదు. నువ్వు నాజూగ్గా తింటే నేనేనా మోటుగా తినేది?" అంది తులసి.

"అసలు నీకు జున్ను రుచి తెలుసా ఇందిరా? తెలిస్తే అలా అంటావూ? షోకుపోక తిను తిను." తను కానిస్తూ అన్నాడు కృష్ణమోహన్. అంతా తినేసరికి జున్నంటే అసహ్యమనిపించింది ఇందిరకి.

"సాయంత్రం చెర్లో స్నానం! రెడీయేనా మీరిద్దరూ?" అడిగాడు కృష్ణమోహన్.

"ఓ!" అంది వుమ్మడిగా తులసి. ఇందిర మౌనం వహించింది.

"మౌనం అర్ధాంగీకారం. అవునా?" అన్నాడు కృష్ణమోహన్.

"అవును. అర్ధ అనంగీకారంకూడా" నవ్వింది ఇందిర.

"అదేం వీల్లేదు. ఇవ్వాళ సాయంత్రం చెర్లోస్నానం చెయ్యాల్సిందే. మళ్ళీ చెప్పేదిలేదు. నేనలా పంచాయతీకేసి వెళ్ళొస్తాను." వెళ్ళిపోయాడు కృష్ణమోహన్.

సాయంత్రం మావయ్య యింటికి రాగానే కొత్త సమాచారం అందజేసింది తులసి. "ఇవాళ్ళ కూడా నీ ప్రోగ్రాం రద్దయిపోయింది. మేం పేరంటానికి వెడుతున్నాం. అత్తయ్యగారి సుబ్బులు అనుకోకుండా పేరంటం పెట్టింది." అంది, పట్టుపరికిణీలో బుట్టబొమ్మలా తిరుగుతూ. కృష్ణమోహన్ వుసూరుమన్నాడు. పేరంటక్కల్లా తయారవటం చూడగానే గుండెల్లో రాయిపడిపోయింది. "ఛీ. ఛీ! ఈ ఆడవాళ్ళతో ఏదోఅడ్డు. అనుకున్నది చస్తే జరగదు. ఇందిరాదేవికి పేరంటాల మీదెత్తిందేం?"

"బావుందిలే వరస! నేనేం చేశాను మధ్య!" అంది ఇందిర జరీ పైటంచు వేళ్ళతో రాస్తూ.

"రేపు తప్పకుండా వెళదాంకదూ మామయ్యా చెరువుకి పేరంటానికి వెళ్ళకపోతే అత్తయ్యకి కోపం వస్తుంది. ఆ కోపంకంటే నీ కోపమే నయం" అంది తులసి మావయ్యని సముదాయిస్తున్నట్లు.

కృష్ణమోహన్ కోపంగా బయట కెళ్ళిపోయాడు.

"ఊరికే ఎలా వెళతావు? మొన్నమావయ్య తెచ్చిన రవికల గుడ్డల్లో

ఒకటి పట్టుకెళ్ళు" అంది అన్నపూర్ణమ్మ. తులసి గదిలోకెళ్ళి నోగుడ్డ తీసుకొచ్చి పసుపుబొట్లు పెట్టి చేతిలో పట్టుకుంది. బస్తీలో పేరంటాని కెళ్ళటానికి బద్ధకించే ఇ దిర పల్లెటూరి పేరంటా లెలా వుంటాయో చూడాలని ముచ్చట పడింది. మెయిన్‌రోడ్లోనయినా చకచకా నడచేతను- పల్లెటూరి సందుల్లో నడవటానికే తడబడింది. రష్‌గా వుండేచోట్ల ఎవళ్లెలా పోయినా ఎవరికొక్కావాలి? కానీ ఖాళీ సందుల్లో బస్తీపిల్ల నడుస్తూంటే అంతా విరగబడి చూస్తారు.

పేరంటానికి ముత్తయిదువలు, పడుచువాళ్ళూ, పిల్లలూ చాలా మంది వచ్చారు. మండువా అంతా కిటకిటలాడి పోతున్నది. అంతా పట్టుచీరలూ, జరీచీరలే కట్టుకున్నారు. జడల్లో మోపెడేసి పూలగుత్తులు! తులసి వెళుతూనే అందర్నీ ఓసారి కలేసింది. ఇందిరని అందరికీ పరిచయం చేసింది. అంతమంది ఆడవాళ్ళు ఒక్కసారి తనని చూడటంతో ఇందిర సిగ్గుతో ముడుచుకుపోయింది.

పక్కగదిలోకి తీసుకెళ్ళిం దొకావిడి. గదిలో పచ్చితాటాకులమీద తెల్లజరీచీర కట్టుకుకూర్చుంది సుబ్బులు, తలవంచుకుని. దూరంగా వెండి పళ్ళెంలో చాలా రవికగుడ్డలున్నాయి. చాలామంది పేరంటాళ్ళు ఆ పిల్లని వేళాకోళాలు చేస్తున్నారు. "ఏవమ్మోయ్! కూతురు పెద్దదయిందని సంబర పడితే కాదు. అల్లుణ్ణి తేవాలి" అందొ కావిడ సుబ్బులు తల్లి నుద్దేశించి.

"కక్కొచ్చినా కళ్యాణ మొచ్చిన ఆగదమ్మోయ్ వదినా! తేనక్కర్లే కుండానే వస్తాడు అల్లుడు" అందావిడ జవాబుగా. వింటూ నుంచున్న ఇందిరని "పసుపు పూయించుకుందాం రా" అని దొడ్లోకి తీసికెళ్ళింది తులసి. ఓ అమ్మాయి ఇందిరకీ, తులసికీ కాళ్ళుకడిగి తడిమీద పసుపు పూసింది. తర్వాత తిలకం బొట్టుమీదే కుంకుమబొట్టు పెట్టింది. చాలసేపు కూర్చున్నారు చావిట్లో అంతా; తర్వాత బెల్లం కలిపిన నానబియ్యం. నువ్వుల చిమ్మిరీ, అరటిపళ్ళూ తామరాకుల్లో పెట్టి ఇచ్చారు. ఇంటికొచ్చే సరికి పొద్దు పోయింది.

విశేషాలన్నీ అన్నపూర్ణమ్మకి చెప్పింది తులసి. పట్టుపరికిణీ విప్పేసి సాదాబట్టలు కట్టుకుని అంది— "నీ చీరకూడా విప్పుదువుగాని పద" ఇద్దరూ పైకివెళ్ళారు. కృష్ణమోహన్ పిట్టగోడ కానుకునించుని చింతకేసి చూస్తు న్నాడు, తులసీ ఇందిరా రావడం గమనించనట్లు.

"ఏమిటో అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్!" అంది ఇందిర పక్కన నించుని.

"ఏదో వోటి, నాతో మాట్లాడకండి."

తులసి నవ్వింది. "ఓ! మావయ్యకి కోపం వచ్చిందిఇందిరా" అంది.

"అయితే మనమే మాట్లాడుకుందాం. చూడు తులసీ! పాదాలమీద పసుపు కుచ్చెళ్ళ జరీకంటింది. పోనీలే మీ వూళ్ళో జరిగిన పేరంటానికి ఆనవాలుగా వుంటుంది కదూ?"

కృష్ణమోహన్ చలించలేదు.

"ఐతే ఇందిరా! పాపం రాయి తగిలి బొటనవేలు నెత్తురు కారింది కదా? ఇప్పుడెలా వుంది?" అంది తులసి కళ్ళతో సైగజేస్తూ.

"అబ్బా! చాలా బాధగావుంది తులసీ! అసలు నిలబళ్ళేకపోతున్నాను" అంది బాధగా ఇందిర పిట్టగోడకు జేరబడి.

"అంత కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడవడం దేనికి. బాగా నొప్పిగా వుందా?" అన్నాడు కృష్ణమోహన్ ఆదుర్దాగా. తులసి ఫక్కుమంది- "అంతా వుత్తదోయ్" అంటూ.

"ఓడిపోయావు నువ్వు" నవ్వింది ఇందిర. కృష్ణమోహన్ తెల్ల బోయినా తమాయించుకుంటూ "నీదగ్గరెప్పుడూ వోడిపోతాను ఇందిరా!" అన్నాడు.

★ ★ ★ ★

కొయ్యమీదే కూర్చుని చెరువులోకి దిగనని మొండికేసింది ఇందిర.

"లోతు వుండదు. అడుగునంతా యిసుక. మేము చాలాసార్లు స్నానం చేస్తుంటాం ఇందిరా! ఏమీ భయం ఉండదు" అని చెప్పింది తులసి. ఇందిర చాలాసేపు ఆలోచించింది.

"మరి బట్టలెక్కడ మార్చుకోటం?" సందేహం వెలిబుచ్చిందిఇందిర.

"ఇన్ని చెట్లున్నాయి. దేని చాటునైనా మార్చుకోవచ్చు."

"పోనీ నేను తొమ్మిదిమైళ్ళు వెళ్ళిపోయి కూర్చుంటాను. మీరు పిలిచేదాకా రాను. సరా?" అన్నాడు కృష్ణమోహన్. ఇందిర నవ్విందిగానీ అప్పటికి వొప్పుకోలేదు. "మీరు దిగండి చూస్తాను" అంది.

"ఇదేం కుదరదు తులసీ! నువ్వా రెక్కట్టుకో" అంటూ కృష్ణ మోహన్ బలవంతానికి పూనుకునేసరికి ఇందిర బ్రతిమాలుకొంది-"ఒద్దొద్దు.

నే దిగుతాను."

తులసి చొరవగా కొయ్యమీదనుంచి నీళ్ళలోకి దిగి అలా అలా లోతుకెళ్ళింది. ఇందిర భయం భయంగా ముందు కాళ్ళు జార్చి నెమ్మదిగా దిగి నుంచుంది.

"ఏమిటా భయం? నీ ప్రాణమేనా అంత తీపి?" అంటూ నాలుగ డుగులు ముందుకు లాక్కెళ్ళాడు కృష్ణమోహన్. నీరు నెమ్మదిగా చల్లగా తాకుతూ పై కెక్కుతోంది. నీళ్ళమీద చీర గొడుగులా లేచింది. "బట్టలు బలవంతాన నీళ్ళలో ముంచెయ్యాలి" అంది నీళ్ళలో తెగ తిరుగుతూ తులసి. ఇందిర చీరని చేత్తో అదిమిపట్టి మరికొంత దూరం వెళ్ళేసరికి నీరు గుండెలదాకా పాకి పైట లేచి నీళ్ళమీద తేలియాడసాగింది. కంఠం వరకూ తడుపుకుని కాస్త వెనక్కెళ్ళి నుంచుంది ఇందిర. చలికి ఒళ్ళంతా గగుర్పొడిచింది. వణకుతూ నించుంది ఇందిర.

"చూడు తులసీ! ఇందిర నిలుచుండిపోయింది, మలిచిన శిల్పంలా!" అన్నాడు కృష్ణమోహన్.

తడిబట్టలు ఒంటి నంటిపోవటం చూచి ఇందిర సిగ్గుతో చితికి పోయింది.

"తడిశాక గాలిలో నుంచుంటే చలేస్తుంది ఇందిరా! కంఠంవరకూ నీళ్ళలో మునిగిపో. ఇలా రా! అదిగో ఆ తామరకాడ అందుకో గలవా?" అంటూ తులసి ఇంకాస్త దూరంవెళ్ళి తామరకాడలు తెంచి గొలుసులు చెయ్య సాగింది.

ఇందిర నిర్భయంగా నీళ్ళలో దిగింది చొరవచేసి.

"నువ్వు కాస్త దూరంగా వెళ్ళు కృష్ణమోహన్." అంది ఇందిర నీళ్ళని చేత్తో సర్దాగా పోగుచేస్తూ.

"నే వెళ్ళను. ఇది నా చెరువు. నన్ను దూరంగా పొమ్మనటానికి నువ్వెవరివి" అన్నాడు హాస్యంగా కృష్ణమోహన్, ఇద్దరిమీద నీళ్లుజల్లుతూ.

"ఏయ్! తల తడుస్తుంది ఇలా ఐతే నే నుండను" అంది తులసి చిరుకోపంగా.

"ఉండకపోతే వెళ్ళు, నేనూ ఇందిరా ఆడుకుంటాం ఎంచక్కా!"

"నే నసలే వుండను. రా తులసీ పోదాం చాలుగానీ" అంది ఇందిర

తులసికి కళ్ళతో సైగచేస్తూ. ఇద్దరూ కోపం నటిస్తూ రేవుకేసి మళ్ళారు. ఇద్దర్నీ కొయ్యదాకా వెళ్ళనిచ్చి చెరో రెక్క పట్టుకుబరబరా ఈడ్చుకెళ్ళాడు కృష్ణమోహన్ లోపలికి. తులసి కిలకిల నవ్వేసింది. ఇందిర బుంగమూతి పెట్టింది, నీళ్ళను చేతుల్తో చెల్లాచెదురుచేస్తూ.

"తులసీ! మీకూ నాకూ పందెం. మీరు కొయ్య దగ్గరికి వెళ్ళేవరకూ ఇక్కణ్ణుంచి కదలను. కొయ్య ఎక్కుతోంటే గమ్మునొచ్చి వెనక్కి లాక్కొస్తాను. నే వొచ్చే లోపునే మీరెక్కిపోతే నే వోడిపోయినట్టు. మీ రెక్కలేకపోతే మళ్ళీ కాసేపు నీళ్ళలో తిరిగి వెళ్ళాలి, ఒప్పుకుంటారా?" అన్నాడు కృష్ణమోహన్ ఇద్దర్నీ చూస్తూ.

"నేను ఒప్పుకుంటాను. నువ్వో?" అంది తులసి.

"సరే" అంది ఇందిర.

కృష్ణమోహన్ దూరంగా వెళ్ళి నుంచున్నాడు ఇద్దరూ కొయ్య దగ్గరి కొచ్చేశారు.

"వచ్చేస్తున్నాను" అంటూ అంత దూరం నుండి వచ్చేస్తున్నాడు కృష్ణమోహన్. జారుడుకొయ్య తొందరగా ఎక్కబోతుంటే జారిపోతుండేది. పైగా కంగారు. ఇంతలోకి కృష్ణమోహన్ రావటం, ఇద్దర్నీ వెనక్కు లాక్కుపోవటం తులసి విరగబడి నవ్వుతోంది ఆటకి. ఇద్దరు నాలుగైదు సార్లు వోడిపోయారు. వో పట్టులో తులసి ఎక్కేసింది కొయ్య. ఇందిర వోడిపోయి వెనక్కిపోయింది. కృష్ణమొహన్ ఇందిరని దాదాపు మధ్యకి తీసికెళ్ళిపోయాడు గట్టిగా పట్టుకుని—"ఇక నే నాడలేను. అలుపుగా వుంది. వెళ్ళిపోదాం" అంది ఇందిర జాలిగా. అతను ఇందిరని తీసికొచ్చేశాడు. తులసి చెయ్యి పట్టుకుంది. ఇందిర గట్టుమీద కొచ్చింది కృష్ణమోహన్ తుండు, బట్టలు తీసుకుని దూరంగా పోయాడు. తులసి, ఇందిర చెరువుగట్టు మీద బట్టలు మార్చుకున్నారు, తడిబట్టలు నీళ్ళు పిండేసి, సంచిలోకుక్కి చెట్టు మొదట్లో పెట్టింది తులసి- "ఆనక అప్పన్న తెస్తాళ్ళే" అంటూ.

"ఆకలి, ఆకలి, ఏదీ నువ్వు తెచ్చిన తాయిలం తొందరగా పెట్టు" అంటూ పొడిబట్టలు కట్టుకుని తుండు చెట్టు మొదటికి విసిరేసి హడావిడిగా వచ్చి ఇద్దరి మధ్యా కూర్చున్నాడు కృష్ణమోహన్.

"అంత కంగారైతే ఎలా? కాసిని తామరాకులు కొయ్యి ముందు. ఈ తాయిలం ఏమిటో ఇందిర చెప్పుకోవాలి" అంది తులసి టిఫిన్ కారి

యరు ఊడదీస్తూ.

"ఇందాక చెప్తే కోసేవాణ్ణికదా" అంటూ గట్టుమీద నుంచి వంగి నాలుగైదు తామరాకులు కోసి తెచ్చాడు కృష్ణమోహన్.

ఇందిర కాసేపాలోచించి "పరమాన్నం" అంది టిఫిన్ చూసి.

"తప్పావులే, నువ్వు మావయ్యా?" అతనికి కూడా అంతుపట్ట లేదా తాయిలం.

"ఇదేదో పరమాన్నంలా వుంది. ఏమిటి చెప్మా? ఆఁ, అటుకులు పాలలో........"

"అటుకులా? చాలాసార్లు చూశానుగానీ తెలుసుకోలేక పోయానే." అంది ఇందిర తింటూ.

"పంచదార చాల్లేదు తులసీ!" అన్నాడు కృష్ణమోహన్.

"ఛ, ఎక్కువైంది" అంది ఇందిర.

"కాదు. సరిపోయింది." అంది తులసి. కడుపులు నిండుతున్నకొద్దీ కబుర్లు పూరుతున్నాయి.

"నువ్వు ఏతాం- మోటబావి- దిగుడుబావి చూశావా?" అంది వున్నట్టుండి తులసి.

"పేర్లు విన్నట్టు గుర్తు. ఎక్కడో? నే నెప్పుడు చూశాను?" అంది ఇందిర.

"ఐతే మావయ్యా! రేపు రాఘవులతోటకి వెళదాం, ఇందిర చూస్తుంది" అంది తులసి.

"అవి పనిచేసే టైంలో చూస్తే బావుంటుంది. ఇప్పుడెందుకూ? వద్దు" అన్నాడు కృష్ణమోహన్.

"అదేమిటి? అన్నీ చూపిస్తానని తీసుకొచ్చి." అంది ఇందిర ఆశగా.

"ఐతే చూస్తావా? సరే వెళదాంలే."

"లే-అంటేకాదు. వెళ్దాం-అవెలా వుంటాయో చూస్తాను. తులసీ! చేతులు కడుక్కుందాం వస్తావా?" ఇద్దరూ వెళ్ళి కాయ్యమీద నుంచుని చేతులు కడుక్కున్నారు. టిఫిన్‌తో నీళ్ళు తెస్తే కృష్ణమోహన్ కూడా కడుక్కున్నాడు.

"ఇక వెళదాం. కిందికి వంగిన కొమ్మలమీద కాసేపు కూర్చుందాం" అంది ఇందిర.

"నిన్న వుయ్యాల సరిగా వూగలేదు. కాసేపు వూగి వెళదాం" అంది తులసి వుయ్యాలకేసి వెళ్తూ. ఇందిరకూడా రెండో వుయ్యాల అందుకుంది.

మొన్నటికంటే నయంగా వుంది. చెరువు గట్టున ఎత్తయిన కొమ్మలకి వేసిన తాళ్ళ ఉయ్యాళ్ళు పోటీగా వూగడం ఎంత సరదాగా వుంటుంది! తోటంతా చెట్లన్నీ చెరువుకూడా దూరంగా వెళ్ళి వస్తున్నట్లనిపిస్తుంది. కాసేపటికి ఇందిర ఊగలేనని దిగిపోతే కృష్ణమోహన్ ఊగాడు. ఉయ్యాలెక్కి.

"ఇదివరకు నేను ఉయ్యాల ఊగడానికి వెళుతుంటే మావయ్య నన్ను తిట్టేవాడు. ఇప్పుడు మనతో చేరి ఆడపిల్ల లాటలాడుతున్నాడు"- అంది తులసి ఇందిర దగ్గిరకొస్తూ. తరువాత చాలాసేపు తోట షికారు!

మర్నాడెక్కడికి వెళ్ళడానికీ వీలులేకపోయింది- సన్నగా వాన లంకించు కుంది పొద్దుటినుంచే.

"పంచాయితీలో కేరమ్సు బోర్డు ఉంటుంది. తెప్పించనా? ఆడుకుందాం" అన్నాడు కృష్ణమోహన్.

"వద్దు-మేం పచ్చీసు ఆడుకుంటాము" అంది తులసి. "ఐతే నాకేం ఊసుపోతుందీ? ఎక్కడికన్నా పోదామంటే ఈ చినుకు లొకటీ. ఏం ఇందిరా! కేరమ్సు నీ కెంతో ఇష్టం కదూ? తులసికూడా నేర్చుకుంటుంది."

"పచ్చీ సెలాగుంటుందో నేర్చుకుంటాను. కేరమ్సు తెలిసిందేగా. పల్లెటూరిపద్ధతులు నేర్చుకో మన్నావు కదూ?" నవ్వింది ఇందిర నిగూఢంగా.

"సరసుని తీసుకువస్తాను. అది వుంటే ఆట బాగుంటుంది." అంటూ పరిగెత్తింది తులసి.

"ఈ వర్షంలో ఎలా వస్తుం దా అమ్మాయి?" అంది ఇందిర.

"వాళ్ళ ఇల్లు దగ్గరేలే. ఐతే మాత్రం రాకపోతే ఊరుకుంటుందే ఇది? నే పోతాను. వాళ్ళంతా వస్తే ఇక్కడ చిక్కడిపోవాలి" లేచాడు.

"అప్పుడే ఐదు రోజులైంది అమ్మావాళ్ళు ఏమనుకుంటున్నారో ఇంటి దగ్గర."

"ఆఁ, వెళ్ళవచ్చులెద్దూ! నిన్ను క్షేమంగా అప్పజెప్పే బాధ్యత నాది. పోనీ రేపో కార్డురాయి. అత్తవారింట్లో క్షేమంగా వున్నాను అని."

ఇందిర నవ్వింది. కృష్ణమోహన్ నవ్వుతూ వెళ్ళిపోయాడు. మరు క్షణంలో తులసి ఇద్దరమ్మాయిల్ని వెంటేసుకుని పచ్చీసు బల్లా, గవ్వల డబ్బా తీసుకొచ్చింది.

"ఈ అమ్మాయి సరస్వతీ, ఈ అమ్మాయి రాధ. నలుగురి మీదా ఆట బావుంటుంది," అంటూ నాలుగురకాల పావులు వేరువేరుగా పెట్టి గవ్వలు చేతులోకి తీసుకుంది తులసి.

"అసలీ ఆట పద్ధతు లేమిటో సింపుల్‌గా చెప్పకపోతే ఎలాగాడ్డం?" అంది ఇందిర.

"చూస్తుండు. అదే తెలుస్తుంది. మొత్తం అయిదు పందాలు. అంతా పావు లెక్కించు కునేదాకా వొకర్నొకరు చంపుకోడానికి వీల్లేదు. చంపుడు పందెం దొరికితేకానీ పంట కెళ్ళకూడదు."

"అబ్బో! బోలెడు నియమాలు. అసలు ఆట అడనీ అదే బోధ పడుతుంది." అంటూ తులసి గవ్వలు గులకరించి పోసింది "పచ్చీసు" అంది వుషారుగా.

చేతుల్లో గవ్వలు కదిపి కిందపోస్తే అవి ఇష్టం వచ్చినట్లుపడడం—

దాన్నిబట్టి పందాలు, పచ్చీసులూ, తీసులూ, దస్‌లూ, "బలే సరదాగా వుందే" అనుకుంది ఇందిర. ఆటలో ఒకళ్ళని ఒకళ్ళు చంపుకోటం! తిరిగి ఎక్కించుకోవడం! చంపిన వాళ్ళకి సంతోషం! చచ్చిన వాళ్ళకి ఉక్రోషం! రాధ వుత్త వుడుకు మోతుపిల్ల. పావు చచ్చినప్పుడల్లా బిక్క మొహం పెట్టేసేది. తిరిగి పందెం వేసి చచ్చినదాన్ని బ్రతికించుకునే వరకూ ఒకటే ఆరాటం! మొదటి ఆటలో సరస్వతి ముందు పండింది. ఇందిర వోడి పోయింది. తరువాత రెండాటల్లో ఇందిరే వోడిపోయే సరికి బాధనిపించింది. నేర్పుగా, పట్టుదలగా ఆడి ముందు పండింది నాలుగో ఆటలో. మొత్తానికి పచ్చీసు పట్టుపడింది. పైగా సరస్వతితోనూ, రాధతోనూ స్నేహం కలిసింది.

"మా యింటి కొకసారి రండి!" అంది సరస్వతి ఆప్యాయంగా ఇందిరతో.

"అలాగే; మరి చినుకులు పడుతున్నాయ్ కదా?" తప్పుకోబోయింది ఇందిర.

"మరేం ఫరవాలేదు. మేం రాలేదేమిటి?"

"పద వెళ్దాం. వాళ్ళిళ్ళు చూద్దువుగాని" అంటూ ఆట ఎత్తేసింది తులసి. మధ్యలో అపెత్తేసినందుకు కోపం వచ్చింది రాధకి.

"ఏమిటే కంగారు? నీతో ఏదైనా ఇంతే. అయ్యేదాకా ఆరాటం...." అంటూ విసుక్కుంది. తరువాత నలుగురూ ఆ చినుకుల్లోనే దొడ్డి దారిన సరసూ వాళ్ళింటి కెళ్ళారు.

"బస్తీవాళ్ళు మా పల్లెటూరి వంటలు తింటారా?" అంటూ నెల్లాళ్ళ క్రిందట వండి భోషాణంలో భద్రపరచిన అరిసెలు పెట్టింది సరస్వతి. పెట్టింది పూరుకోక తినే వరకూ బలవంత పెట్టింది. ఓ అరిసె తినటానికి ఇందిర అపసోపాలు పడింది. తర్వాత వాళ్ళిళ్ళూ దొడ్డీ చూపించింది సరస్వతి. "మా ఇంటికి రండి తులసీ! ఇక్కడే కదూ?" అడిగింది రాధ.

"రేపొస్తామండీ తప్పకుండా. ఇప్పుడు నాకు తల నొప్పిగా వుంది" అంటూ తప్పుకోబోయింది ఇందిర, ఆవిడేం బూరెలు పెడ్తుందోనని భయమేసి. ఇందిర ఎత్తేం సాగలేదు. రాధ మరీమరీ అడిగేసరికి తులసి ఆ చినుకుల్లో రాధా వాళ్ళింటితోపాటు నాలుగైదిళ్ళు తిప్పి సాయంత్రానికింటికి తీసుకొచ్చింది. "నీ తిరుగుడు ఆ అమ్మాయికూడా నేర్పేసేలా వున్నావు తులసీ!" అంటూ హాస్యంగా మందలించింది అన్నపూర్ణమ్మ ఇంటికిరాగానే.

"నా ఐడియా అంతా తల్లక్రిందులై పోయిందమ్మా! ఇందిరని చూసి తులసి కుదురు నేర్చుకుంటుందనుకున్నాను. తులసిని చూసి ఇందిరే అల్లరి నేర్చుకుంటున్నదేవిటి?" ఆశ్చర్యం వెలిబుచ్చాడు కృష్ణమోహన్.

"కాబట్టి ఇందిరనుచూసి నువ్వు కూడా అల్లరి నేర్చుకో" అంది తులసి నవ్వుతూ.

"ఈ పూట జున్నుపాలు విరిగిపోయాయి తులసీ! దాలిమీద పెట్టాను. కాగాయేమో చూసి తాగండి." అంది అన్నపూర్ణమ్మ. తులసి ఒక్క పరుగున వెళ్ళి మూడుగ్లాసుల్తో పాలు తీసుకొచ్చింది.

"మావయ్య కేమో తీపి ఎక్కువుండాలి. ఇందిరకి తక్కువ!" అంది పంచదార కలుపుతూ. ఇందిరకి ఈ తాగటాలూ.... తినటాలూ ఘోరమైన సమస్యైపోయింది. తను తినకపోతే కృష్ణమోహన్ తిననంటాడు. కృష్ణమోహన్ తినకపోతే తులసి తిననంటుంది. అంతా మానేస్తే వాళ్ళమ్మగారు ముట్టుకోరు. ఈ పెరుగులూ, పాలూ, పిండిపంటలూ, నాలుగేసి కూరలూ తినేసరికి ఇందిర తల ప్రాణం తోక కొస్తోంది. కాదనలేక

జొన్న పాలగ్లాసందుకుంది.

★ ★ ★ ★

"రాఘవులు తోటకి తీసి కెళతాను. ఆ తర్వాత కొబ్బరి తోటలోంచి మన తోటకొచ్చి కాస్సేపు చెరువులో ఆడుకుందాం— లేకపోతే తీసి కెళ్ళను" అన్నాడు కృష్ణమోహన్.

"బావుంది షరతు" అంది మూతి ముడుచుకుని ఇందిర.

"బావుండకపోతే మానెయ్. మోటబావీలేదు; గీటబావీలేదు."

"తీరా అవిమూశాక చెర్లో దిగనంటే?" ప్రశ్నార్థకంగా చూసింది ఇందిర.

"అబ్బో! గడుసుదానివే! ఎత్తుకు తీసికెళతాను చెర్లోకి. ఇంతకీ నా బలవంత మేమీలేదు సుమా ! చక్కగా రాఘవుల తోటా-మోటబావీ చూడాలంటే నీ ఇష్టం."

"సరే" అంది ఇందిర- ఆ సాయంత్రం ముగ్గురూ మోటబావి చూట్టాని కెళ్ళారు. అదికూడా మామిడి తోటే. తోటకు మధ్య అగాధం లాంటి బావి! బావికి చుట్టూ ఏమీలేదు. ఒకవైపునకొయ్యలు పాతి వున్నాయి. వాటికి ముందు నాలుగైదు గజాలవరకూ చోటు నలిగి వుంది.

"తోలుతో కుట్టిన పెద్ద పెద్ద బానలుంటాయి. బానని లావుపాటి తాడుకు కడతారు. ఈకాస్త మేరలో ఎడ్లు వెనక్కీ ముందుకి నడుస్తుంటాయి. వెనక్కి నడచి బావిదగ్గరికి రాగానే బాన నీళ్ళలో మునుగుతుంది. ఎడ్లు ముందు నడుస్తూంటే బాన పైకొచ్చి ఆటోమేటిగ్గా నీరు బోదిలో పడు తుంది. బోదివెంట చెట్లకి పోతుంది. దీన్ని మోట తోలటం అంటారన్న మాట తెలిసిందా!" విశదీకరించాడు కృష్ణమోహన్ బావిని చూపిస్తూ. బావి దగ్గరికెళ్ళి చూడటానికి భయమేసింది ఇందిరకు-"వెళ్ళొద్దు. కళ్ళు తిరుగు తాయి" అన్నాడు కృష్ణమోహన్.

"మావయ్యా! మన వూరికి కరెంటు వస్తే నీళ్ళు తోడటానికి మిషన్ పెట్టిస్తాడట రాఘవులు" అంది తులసి.

"ఆఁ, ఇప్పట్లో ఎక్కడా మనకి కరంటూ" అన్నాడు.

"మరి ఏతాం ఎలా వుంటుందీ ?" అంది ఇందిర.

"వెడదాం. అది ఇలా నుయ్యిలా ఉండదు. కాస్త వెడల్పుగా చిన్న గుంటలా ఉంటుంది చూస్తే తెలుస్తుంది పదండి."

నాలుగైదు మళ్ళు దాటించి ఏతం దగ్గరికి తీసికెళ్ళాడు.

"ఇలాంటిది ఏదో సినిమాలో చూశాను నేను" అంది ఇందిర ఏతం చూస్తూనే.

"దీనికి ఎడ్లని ఉపయోగించరు. అదిగో, కొయ్యమీదికి మనిషే ఎక్కి కాస్త వెనక్కి వస్తుంటాడు. ఒడ్డు దగ్గరకు వచ్చిన నీటినీ, దొప్పల్నీ మరో మనిషి అందుకుని పక్క బోదిలోకి పోస్తాడు. పనిచేసేటప్పుడు చూస్తే బావుంటుంది ఇందిరా! ఈ వర్షాకాలంలో నీ రెవరిక్కావాలి?" అన్నాడు కృష్ణ.

"దిగుడు బావంటే అదెలా వుంటుంది!" అంది ఇందిర.

"బలే దానివే నువ్వు. తులసి కబుర్లట్టుకుని నా ప్రాణాలు తోడేస్తున్నావు, మోట తోడినట్టు. అసలీ వూళ్ళో దిగుడు బావులే లేవు. నువ్వెక్కడ చూశావ్ తులసీ!"

"మా నాన్నగారి ఊళ్ళో చూశాను. నువ్వూ చూశావా? అని అడిగానుగానీ ఇక్కడున్నాయన్నానా ఏమిటి?" అంది తులసి మూతి మూడు వంకర్లు తిప్పి.

"దిగుడు బావంటే ఏం లేదు ఇందిరా! లోపలికి దిగటానికి ఒడ్డు వెంటే గుండ్రంగా, నీళ్ళదాకా మెట్లుంటాయి. సుజాతా వాళ్ళ నత్తగుల్ల మేడ మెట్లెక్కటం నీ కలవాటే కదూ? అదే మాదిరి. కాని చాలా ధైర్యం కలవాళ్ళు తప్ప దిగలేరు. ఇహ పోదాం పదండి. మన తోటకి."

ఇందిరకు సుజాత గుర్తొచ్చింది. "ఆ పల్లెటూళ్ళో ఏం చూస్తావ్ ఇందూ? హాయిగా హైద్రాబాద్ ఎక్స్కర్షన్ వెళదాం" అంది, తన అభిప్రాయం వినగానే. "అవునులే. ఎంతైనా అత్తవారి వూరు,చూసిరా" అంటూ హాస్యం చేసింది, తనపట్టు మార్చుకోనందుకు. కానీ వెళ్ళాక సుజాతకి తను చూసిన వన్నీ చెప్తే ఏమంటుందీ? పూసగుచ్చినట్లు చెప్పాలి.

"ఏమిటి? మాటా మంచీ లేకుండా తెగ ఆలోచిస్తున్నారిద్దరూ!" అన్నాడు కృష్ణమోహన్.

"సుజాత గుర్తొచ్చింది" అంది ఇందిర.

"మరి నీకు?"

"మా నాన్న జ్ఞాపకానికొస్తున్నాడు" నవ్వింది తులసి.

"ఓహో! ఇలా ఊహల్లో కొట్టుకుపోతే చాలా చిక్కు. చెర్లో ఒక్క

మునుగు మునిగితే కావలసినంత హుషార్" అన్నాడు ఉషారుగా కృష్ణ మోహన్.

"అన్నట్టు మన కొబ్బరి మడి చూపించనే లేదు ఇందిరకి. ఐతే కాస్సేపిక్కడ కూర్చుందాం" అంది తులసి.

ముగ్గురూ మెత్తటి పచ్చగడ్డి మీద కూర్చున్నారు. చెట్లు దూర దూరంగా చాలా ఎత్తుగా వున్నాయి. సన్నని కొబ్బరాకులు గాలికి ఊగు తున్నాయి. చాలా చెట్లకి గెలలు వేలాడుతున్నాయి.

"అప్పన్న వుంటే కొబ్బరి బొండాలు దింపును ఈసారి వాణ్ణి తీసుకువద్దాం" అంది తులసి.

"కొబ్బరితోటలో తిరిగాక చెర్లో ఆట! ఉయ్యాళ్ళు ఊగటం! కింద కున్న మామిడి చెట్లెక్కటం!" అంది ఇందిర ఉత్సాహంగా.

"మాట్లాడ్డానికే సిగ్గుపడే ఇందిరకి అల్లరెలా పట్టుబడింది?" అను కున్నాడు కృష్ణమోహన్.

"దాగుడుమూత లాడుకుందాం. ఈ చెట్టు, తల్లి. నేను దొంగని. మీరు పరిగెత్తండి" అంది తులసి సంతోషంగా.

"నాకు పరిగెత్తటం రాదు బాబూ! తొందరగా దొంగనైపోతాను. నా కెవరూ దొరకరు" అంది ఇందిర.

"నే దొరికిపోతాలే. పల్లెటూళ్ళో పది రోజులుండి పరిగెత్తటం నేర్చుకోకపోతే షేమ్ కదూ! మరి పరిగెత్తు! తులసి వచ్చేస్తుంది." - ఇందిర చెయ్యి పట్టుకు పరిగెత్తాడు కృష్ణమోహన్.

చాలా సేపు తులసి మావయ్యనే కవ్వించింది. ఎంతకీ దొరక్కపోతే ఇందిరను అందేసుకుంది. ఇందిర దొంగైంది. కృష్ణమోహన్ వెనుక పరుగెత్తింది. రెండు నిమిషాలు అందకుండా తిరిగి ఎక్కడ ఆట మానేస్తుందోనని భయమేసి దొరికి పోయాడు.

"అదేమిటీ? నాకంటే బాగా పరిగెత్తిందా ఇందిర? కావాలని దొరికి పోతే నే నసలాడను" అంటూ వెళ్ళి కింద చతికిలబడింది తులసి కోపంగా. దాన్ని బ్రతిమాలి ఆటలోకి తీసికొచ్చేసరికి పెద్దలు దిగొచ్చారు. కృష్ణ ఇందిరని కాస్సేపు కవ్వించి వదిలేసి తులసిని తరిమి తరిమి పట్టుకున్నాడు.

"ఇక చాలు బాబూ ఆట!" వగరుస్తూ అంది తులసి.

"అబ్బా! ఎంత పరుగుతీసింది! చచ్చాను పట్టుకోటానికి. అప్పటికైనా

ఐడ దొరక్కపోతే” కృష్ణమోహన్ అలుపుగా చతికిలబడ్డాడు గడ్డిలో.
ఇందిర దర్జాగా కూర్చుంది కొమ్మెక్కి.

* * * *

వారం దాటింది. రెండు రోజుల క్రిందట ఇంటికో కార్డు రాసింది ఇందిర నాలుగు రోజుల్లో వస్తానని. కానీ పల్లె వాతావరణం పట్నాన్ని మరిపిస్తున్నది. సహజమైన ప్రకృతిశోభ చూస్తున్న కొద్దీ పట్నంలో పార్కులూ, బీచీలు, కృత్రిమంగా తోస్తున్నాయి. తల్లి ప్రేమని మరపించే అన్నపూర్ణమ్మ ఆదరణ! కొన్ని హద్దుల్లో స్నేహం చేసే కాలేజీ స్నేహితుల్ని తోసిరాజనే తులసి అమాయకమైన స్నేహం! తనే సర్వస్వంగా ప్రేమించి మురిసే కృష్ణమోహన్ అనురాగం! నోటినుంచి మాట రాకుండానే సంతోషంగా ఆప్యాయంగా ప్రవర్తించే అప్పన్న దాస్యం!—అన్నీ ఇందిరకి తన్మయత కలిగించాయి. చాలా చీకటితో కోడి కూత వింటూనే లేవటం సర్దాగానే ఉంది. ఆ మసక చీకటిలోనే వీధులన్నీ సందడిగా ఉంటాయి. వంటపాకలో కూర్చుంటే అన్నపూర్ణమ్మ బస్తీకబుర్లూ, తమ ఇంటి సమాచారాలూ అడుగుతుంది చనువుగా. స్నానం అయ్యేసరికి రెండు పూలదండలు తయారు చేస్తుంది తులసి. పది దాటితే కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు! మధ్యాహ్నం ఏదో ఆట, లేదా చావిట్లో పిచ్చాపాటీ! సాయంత్రం కాళ్ళతోపుకో, మామిడి తోటకో షికారు. ప్రోగ్రాం ఇందిరే సెలెక్ట్ చేస్తుంది. దీపాలు పెట్టేవరకూ దాగుడుమూతలో, వుయ్యాల లూగటమో, చెర్లో ఆటో ఏదో ఒకటి! రోజులు క్షణాల్లా దాటిపోయాయి.

“లాస్టియర్ కూడా! ఇంటికెళ్ళి ఏమైనా పుస్తకాల బూజు దులుపుకోటంవుందా? ఏకంగా కాపురం వుండి పోతావా!” ఊగే ఉయ్యాల ఆపుజేసి తాళ్ళు పట్టుకుని అడిగాడు కృష్ణమోహన్.

“వెళ్ళను. వెళ్ళాలని లేదు” నవ్వింది ఇందిర.

“ఒక్క ఐదారు నెలలు కళ్ళు మూసుకో ఇందూ. తర్వాత పెద్ద వుయ్యాల వేయించుకుని జంటగా ఊగుదాం.”

“సరేలే! విడు- తులసి వస్తుంది.”

“వస్తే వస్తుందిలే. ఎన్నాళ్ళీ దాగుడు మూతలు? ఏనాటికైనా తెలియాల్సిందేగా?”

తులసి అప్పన్నతో కొబ్బరి బొండాలు దింపించు కొచ్చింది.

నలుగురూ లేత కొబ్బరి తింటూ కూర్చున్నారు. తులసి ఆనాడు ఇందిర కోరిక మీద చీర కట్టుకుంది. హుందాగా వుంది.

"తులసి చీరతోనే బావుంది నాకు" అన్నాడు కృష్ణమోహన్ పరకాయించి చూస్తూ.

తులసి సిగ్గుపడింది- "మావయ్యా నన్నే చూస్తూ వుంటాడు కాబోలు!" అనుకుంది; ఐనా పైమాటగా "ఇందిర కంటేనా?" అంది. కృష్ణమోహన్ ఇందిర కేసి చూశాడు.

"తులసి ఎర్రగా దృఢంగా వుంటుంది. ఇందిర తెల్లగా సన్నగా వుంటుంది. అందుకని తులసి నిగనిగలాడే ముదురాకు! ఇందిర నవనవలాడే లేచిగురు! అవును కదూ అప్పన్నా?" అన్నాడు కృష్ణమోహన్ అప్పన్నని మధ్యవర్తిగా పెట్టుకుని.

"మీ మాటలేమిటో నాకు బోద పటలేదండీ అబ్బాయి గారూ!" అప్పన్న నవ్వాడు.

"పోనీ మీ అబ్బాయిగా రెలా వుంటారో చెప్పు అప్పన్నా!" అంది ఇందిర నవ్వుతూ.

"మా అబ్బాయికేమండీ, రాజా! అబ్బాయిగారి భార్యా చాలా అదృష్టవంతురాలు."

తులసి దూరంగా చూస్తూ కూర్చుంది. ఎవరికేసి చూడలేక.

ఇందిర నవ్వింది నాజూగ్గా.

★ ★ ★ ★

ఆ రాత్రి భోజనాల తదనంతరం పడుకోటానికి పైకి వచ్చిన తులసి మంచినీళ్ళు తేవటం మర్చిపోవటంవల్ల కింద కెళ్ళింది. ఆ వెళ్ళిన వెళ్ళటం ఎంత సేపు ఎదురు చూసినా రాలేదు. గంటా గ టన్నర కూడా గడచి పోయింది. ఇందిరకి నిద్రపట్టడంలేదు. తులసికోసం రాబోతుంటే తులసి ఎదురుపడింది విసురుగా.

"ఏమిటే? వెళ్ళి వెళ్ళినట్లే- వుండిపోయావ్?" అంది ఇందిర వెనక్కొస్తూ.

తులసి మాట్లాడలేదు. మౌనంగా వచ్చి మంచంమీద అటుతిరిగి పడుకుంది. ఇందిర కేమీ అర్థం కాలేదు.

"ఏమిటి తులసీ? ఎవ రేమన్నారు?" అడిగింది.

"ఎవరేమంటారు? అంటే ఏం ఊరుకోను" చెళ్ళుమని జవాబు చెప్పింది.

ఇందిర తెల్లబోయింది. ఈ పది రోజుల్లో ఎప్పుడైనా తులసి ఇంత నిరసనగా మాట్లాడిందా?

"ఐతే నీకు కోపం దేనికొచ్చిందీ!"

"నా కేం కోపంలేదు. తాపం లేదు. నా లాంటి దానికి కోపం వచ్చి ఏం లాభం?"

తులసి మాట్లాడలేదు ఇందిర తులసి మంచంమీద కూర్చుని అంది- "నీ కెందుకో నా మీద కోపం వచ్చింది. తులసీ! నే నేం పొరపాటు చేసి నట్టు గుర్తులేదు. ఒక వేళ ఏదైనా జరిగితే ఏమీ అనుకోకు తులసీ! ఇన్నాళ్ళూ కలిసీ మెలిసీ వుండి తీరా వెళ్ళిపోయేటప్పుడు...."

"పిచ్చిదాన్ని కాబట్టి కలిసీ మెలిసీవున్నాను. ఎంతైనా బస్తీదానివిలే."

ఇందిరకు కాస్త కోపం వచ్చింది- "నే చేసిన పొరపాటేమిటో సూటిగాచెప్పి చివాట్లు పెట్టు. అంతేగానీ నువ్వెంత గొప్పదానివైనా వూరికే మాటలనకు"- ఇందిర తులసి మంచంమీద నుంచి లేచి కిటికీకి జేరగిలబడి నుంచుంది.

"నిన్ను చివాట్లెయ్యడానికి నే నెవర్ని? ఇంటికి అధికారిణివి."

"ఎవరు చెప్పారు?" ఆతృతగా అడిగింది.

"మావయ్య అమ్మతో చెప్తున్నాడు. మీరు స్నేహితులేఅనుకున్నాను. ప్రేమికులు కూడానా?" వెటకారంగా అంది తులసి, లేచి కూర్చుని.

ఇందిర గుండెలో బండ పడింది. ఐనా ధైర్యం చేసుకుని—"ఐతే నీకు కోపం దేనికి మధ్య?" అంది కిటికీలోంచి బయటికి చూస్తూ.

తులసి విస్తుబోయింది—"నాకు గాకపోతే ఎవరికి వస్తుంది కోపం? మావయ్యకీ నాకూ పెళ్ళవుతుందని నీకు తెలుసా...."

ఇందిర వులిక్కిపడి చిత్రంగా చూసింది తులసి మొహంలోకి.

"ఎందుకలా చూస్తావ్? మా అమ్మ చచ్చిపోయిన క్షణం నుంచీ మా అమ్మమ్మ అదే వుద్దేశంతో దగ్గరకి తీసింది. పెళ్ళంటూ జరగలేదుగానీ మావయ్యా పెళ్ళంగానే చెలామణీ అవుతున్నాను. ఇంతవరకూ మావయ్యా కూడా అడ్డుచెప్పలేదు. మరి నిన్ను చూసి మోజుపడ్డాడేమో తెలీదు. మా

ఇద్దరి మధ్య నువ్వేలా రావాలనుకున్నావ్?"

ఇందిర పరిస్థితి ఘోరంగా వుంది. తన చెవులని తను నమ్మలేక పోయింది. కలవరపాటు కనబడనీయకుండా నెమ్మదిగా అంది- "నాకి సంగతేమీ తెలియదు తులసీ! అసలు మొదట్లో కృష్ణమోహన్‌కి మేనగోడ లంటూ ఒకమ్మాయి వుండనుకోలేదు. స్నేహం చాలా దృఢపడ్డాకగానీ ఒకరి కుటుంబ వ్యవహారా లొకళ్ళం తెలుసుకోలేదు. నీ గురించి చెప్పావేదే గాని ఇలా మీ పెళ్ళి విషయం మాట మాత్రంకూడా అన్లేదు. ఆదిలో తెలిస్తే ఈ విషయం ఇంతవరకూ వచ్చేది కాదు."

"ఇప్పుడేం మించిపోలేదు. ఇప్పుడు తెలిసిందిగా!" ముసుగు తన్ని పెట్టి పడుకుంది తులసి.

ఇందిర కాస్సేపు నుంచుని లైటు తగ్గించి పడుకుంది. మనసంతా ఆలోచనల్తో నిండిపోయింది. ఇంత దగాచేసిన కృష్ణమోహన్‌ని ఆ చెంపా ఈ చెంపా వాయించి తల వాచేలా చీవాట్లు పెట్టాలనిపించింది. ఒకవేళ కృష్ణమోహన్‌కి నిజంగా తులసి అంటే ఇష్టం లేదేమో! ఏది ఏమైనా కృష్ణ మోహన్‌తో ఖచ్చితంగా మాట్లాడి రేపువెళ్ళి పోవాలనుకుంది. ఎంత ప్రయ త్నించినా నిద్ర పట్టటం లేదు. తులసి కూడా కదులుతూనే వుంది. దాదాపు ఇందిర ఆ రాత్రి జాగారం చేసింది. తెల్లవారుజాము నెప్పుడో కునుకు పట్టింది.

మెలకువ వచ్చేసరికి కరకరా పొద్దెక్కింది, తులసి లేపకుండా వెళ్ళి పోయింది. ఇందిరకి కిందికి వెళ్ళడానికి సిగ్గేసింది. ఎలానో ధైర్యం చేసు కుని వెళ్ళింది. అన్నపూర్ణమ్మ రోజులా ఆప్యాయంగానే మాట్లాడింది. తులసి అంటీ అంటనట్టుగా ప్రవర్తించింది. ఇందిరా- తులసీ ఎడమొహంగా ఉండటం కృష్ణమోహన్ కనిపెట్టక పోలేదు.

"నన్నివాళ పంపించెయ్యి కృష్ణమోహన్! వెళ్ళిపోతాను" అంది ఇందిర చావట్లో. దానికి అన్నపూర్ణమ్మ కలుగజేసుకుని- "ఇవ్వాళ మం గళ వారం బొట్టుపెట్టడానికి కుదరదు. రేపువెళుదువుగాని అమ్మా! ఇప్పుడే మంత కంగారు?" అంది.

ఇందిర మాట్లాడలేదు.

ఆ సాయంత్రం తులసి తోటకు రానంది. "నాకు తలనొప్పిగా వుంది మీ రిద్దరూ వెళ్ళండి" అంది. ఈ విషయాలన్నీ తోటతో మాటా

డొచ్చని ఇందిర కృష్ణమోహన్‌తో బయల్దేరింది. తోటలో చెరువుగట్టున కూర్చునే వరకూ ఎంత పలకరించినా ఇందిర మాట్లాళ్ళేదు.

"నువ్వలా మూతి బిడాయించుకూర్చుంటే నాకేంతెలుస్తుంది ఇందిరా! సంగతేమిటి? తులసి అలా ఎడం ఎడంగా తిరుగుతుందేం?"

"ఎందుకలా తెలీనట్టు నటిస్తావ్? రాత్రి మీ అమ్మగారితో ఏదో చెప్తున్నావట, తులసి మంచి నీళ్ళకెళ్ళి మెట్లమీద నుంచి వినివచ్చి నా మీద కోపం పెట్టుకుంది. తులసికీ నీకూ పెళ్ళి నిశ్చయమైనప్పుడు నన్ను దగా చెయ్యడం దేనికి మధ్య? నే నేదో నిన్ను మార్చుకున్నానని ఆవిడ వుద్దేశ్యం. నాకీ సంగతి ఏ మాత్రం తెలిసినా ఇలా శృతి మించేదికాదు. ఈ పూట మీ అమ్మగారెదుట తిరగటానికి ప్రాణం చచ్చి పోయింది. నన్ను యాగీ చెయ్యటం నీకు సర్దా?" ఉక్రోషమంతా వెళ్ళగక్కింది ఇందిర.

కృష్ణమోహన్ తాపీగా విన్నాడు. "అయిందా నీ లెక్చరు? పిచ్చి ఇందూ! నిన్ను దగా చేస్తానా? నిన్ను యాగీ చేసి నేను గుట్టుగా ఎలా వుంటాననుకున్నావు? చిన్నప్పట్నుంచీ తులసిని నా పెళ్ళాంగానే పరిగణిస్తున్నారంతా. నేనూ కొంతకాలం పెళ్ళి గురించి ఆలోచించలేదు. పెళ్ళి మీద నాకు ఆలోచనలు రావటం మొదలయినప్పటినుంచీ ఏనాడూ తులసిని నా పక్కన వూహించుకో లేదు. అవసరం వచ్చినప్పుడే ఆ విషయం చెప్పొచ్చని ఊరుకున్నాను. రాత్రి యథాలాపంగా నిన్ను గురించి అమ్మని అడిగాను. 'చాలా గుణవంతురాలు! గర్వం అతిశయం ఏమీ లేవు. చదువుకున్నప్పటికీ మనలో కలిసిపోతుంది' అలా చాలాచాలా పొగడేసింది నిన్ను. సమయం చూసి ధైర్యం చేసి అనేశాను- "అందుకే ఇందిరని మన ఇంటికి తెచ్చుకుందాం అమ్మా! ఈ సంబంధానికి వాళ్ళుకూడా ఇష్టపడతారు" అన్నాను. నా మాటలు విని మా అమ్మ తెల్లబోయింది. కాస్సేపటికి "అదేమిటి? తల్లిలేని పిల్ల. తులసేమైపోతుందనుకున్నావు?" అంది- వెంటనే. నేనన్నాను. "తులసి కేం లోటు. దాని ఆస్తంతాఇచ్చి గొప్ప ఉద్యోగస్థుడికిచ్చి చేద్దాం అమ్మా! మనలో మనం ముడిపెట్టు కోవటం ఏం అందం చెప్పమ్మా? ఇందిర నాకెంతో నచ్చింది. నువ్వు ఒప్పుకో అమ్మా!" అన్నాను. మాఅమ్మ మౌనంగా విని వూరుకుంది. నేనే చాలాసేపు మీ వాళ్ళ గొడవలు చెప్పాను. మా అమ్మ ఒప్పుకుంటుంది ఇందూ! ఒప్పుకోక ఏం చేస్తుంది నేనెదురు తిరిగితే...."

"ఒద్దు! తులసి పాపం, తల్లిలేనిది. చిన్నప్పట్నుంచీ మీ ఇంట్లో పెరిగింది నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని వుంటుంది. అకస్మాత్తుగా మనసెలా మార్చుకుంటుంది?"

"ఏం నువ్వు మాత్రం నా మీద ఆశలు పెట్టుకోలేదా? నువ్వెలా మార్చుకుంటావు?"

"నాదారి వేరు. మార్చుకోకపోతే అనుభవిస్తాను. తులసి కేం ఖర్మ నిన్నాదులు కోటానికి?"

"మీ ఖర్మలూ అనుభవాలేగాని నా లెక్కేం లేదన్న మాట! తులసిని భార్యగా చేసుకోలేను ఇందూ! అది నా కళ్ళముందు పుట్టింది. నేను ఎత్తుకు ఆడించాను. నేను చూస్తుండగానే పెరిగి పెద్దదయింది. దాన్ని ఏనాడు కూడా ఒంటరిగా పలకరించాలనిపించలేదు. నిన్ను చూస్తే మనసు పరవశ మౌతుంది. దాన్ని చూస్తే అటువంటి భావాలే రావు...."

"కాని తులసి, నేనేదో చేస్తున్నానని భ్రమ పడుతోంది. తను మనస్ఫూర్తిగా అంగీకరించక పోతే నేనీ పెళ్ళి చేసుకోలేను కృష్ణమోహన్" ఇందిర చెరువులోకి చూడసాగింది.

"దానితో నీ కెందుకు గొడవ? నా ఇంటిలో అంతా నా ఇష్టం."

"తులసి కష్టపెట్టుకుంటే మీఅమ్మగారుకూడా అయిష్టంగా వుంటారు. వాళ్ళమధ్య నేనెలా కాపరం చేస్తాను?"

కృష్ణమోహన్ చాలా సేపు మౌనంగా కూర్చున్నాడు. "సరేలే. రేప టికి నీకేతెలుస్తుంది- ఈ మాత్రానికే అంత మండిపడ్డావ్ నా మీద? నన్ను నమ్ము ఇందూ! నిన్ను ఒదులు కోలేను. ఒకేచోట పుట్టి పెరిగినవాళ్ళు...."

"నాకు తెలుసు. తులసికి చెప్పు తనిష్టపడితే హాయికదూ—?" ఇందిరలేచి నుంచుంది.

ఇంటి కొచ్చేసరికి పొద్దు పోయింది. తులసి దీపం వెలిగించి చావిట్లో పెడుతోంది.

రాత్రి భోజనాలయ్యాక ఇందిర పైకి వెళ్ళిపోయింది. కాస్సేపటికి తులసి వెళ్ళబోతోంటే కృష్ణమోహన్ మంచి నీళ్ళు తెచ్చిపెట్టమని చెప్పి వీధి గదిలోకెళ్ళి కిటికీ దగ్గరగా వేసివున్న మంచంమీద కూర్చున్నాడు. తులసి వెండిగ్లాసులో నీళ్ళు తెచ్చి డ్రాయరు మీద పెట్టి వెళ్ళిపోబోయింది.

"ఇలా తెచ్చిపెట్టు. అక్కడ పెడితే నాకెలా అందుతుంది?"

తులసి నిర్లక్ష్యంగా గ్లాసు అందించి వెళ్ళబోయింది.

"కూర్చో తులసీ! నీతో మాట్లాడాలి."

"నాతో ఏం మాటలుంటాయి? చదువుకున్నానా; ఆఘోరించానా?" నిలుచునే అంది.

"అందుకే మాట్లాడాలి నీతో. చదువుకుంటే ఎదటివాళ్ళ నర్థం చేసుకొనే దానివి. సరేగాని ఇవ్వాళ తోటకి రాలేదేం?" గ్లాసు కిటికీలో వుంచుతూ అడిగాడు.

"నే నెందుకూ మధ్య?"

"ఇన్నాళ్ళూ ఎందుకొచ్చావ్?"

"ఇన్నాళ్ళూ తెలియలేదు."

"ఇప్పుడేం తెలిసింది? అసలు నువ్వు కూర్చో. నీతో చాలా మాట్లాడాలి."

"అక్కర్లేదు చెప్పు....కాస్సేపు నుంచుంటే అలసిపోయే సుకుమారిని గాను."

తులసి నుంచునే వుంది. కృష్ణమోహన్ క్షణం వూరుకుని తిరిగి అన్నాడు-"నీతో వాదన పెట్టుకోవాలని నా ఉద్దేశంగాదు. సామరస్యంగా చెప్తాను, విను. నీ అభిప్రాయాలు చెప్పు. కూర్చుంటే మాట్లాడుకోడానికి బావుంటుంది తులసీ!"

తులసి ఇంకా మొండిగా వుండలేకపోయింది. కృష్ణమోహన్ ప్రక్కన కూర్చుంది.

"ఇందిరని ఏమడిగావు?"

తులసి మాట్లాడలేదు.

"నువ్వు చెప్పకపోతే పోసి. ఇందిరే చెప్పింది. ఇందులో తప్పేం లేదు. నీకూ-నాకూ పెళ్ళని మనవాళ్ళనుకునే గొడవ నేను తనకి చెప్పలేదు. రాత్రి నువ్వు చెప్పావు కాబోలుగా? తనే మంటుందో తెలుసా? 'తులసి తల్లిలేంది. చిన్నప్పట్నుంచీ అనుకున్న సంబంధం. తను చాలా కష్టపడుతుంది. తులసి మనసు కష్టపడటం నా కిష్టంలేదు. నువ్వు తులసినే చేసుకో.' అంటూ చెప్పుకొచ్చింది. నువ్వు నమ్మలేకపోతే చెయ్యగలిగిందేమీ లేదు గానీ....ఇంత మంచి ఇందిరని నువ్వు అపార్థం చేసుకున్నావు తులసీ! కాని నాకు నిన్ను చేసుకోవటం ఇష్టం లేదు."

తులసి మొహంతో కోపం పొడచూపింది. "ఎందుకుంటుంది అందగత్తెను చూశాక?"

"అదే వద్దన్నాను. దురుసుగా మాట్లాడకు. ఇదేం బొమ్మలాటగాదు, చిన్నప్పటిలా దెబ్బలాడుకోడానికి. ఇద్దరికీ సంబంధించిన సమస్యే. నువ్వా తెలియని దానివేం కాదు. నేను చెప్పే ప్రతి మాటా శ్రద్ధగా విని అర్థం చేసుకో! నేను ఇందిర అందానికి కట్టుబడిపోలేదు. ఫలానా సంగతని చెప్పలేను. నాకు ఇందిర నచ్చింది. నీ కంటే అందమైందేంగాదు ఇందిర. ఆస్తిలో, అందంలో, పనిపాటల్లో-ఒక్క చదువులో తప్ప అన్నిటిలోనూ నువ్వే ఇందిరకంటే ఎక్కువ. ఐనా నిన్ను భార్యగా చేసుకోడానికి మనసంగీ కరించడం లేదంటే కారణాలుంటాయి...."

"ఏమిటా కారణాలు?" హేళనగా అడిగింది తులసి సూటిగా చూసి.

"అదే చెప్పబోయేది—ఎంత వేళాకోళా లాడుకుంటున్నప్పటికి చిన్నప్పట్నుంచీ మనం ఒక్కచోట పెరిగి పెద్దవటంతో నా దృష్టి నీ మీదికి పోవటంలేదు. వయసులోవున్న నీకూ, బువ్వాలాట లాడే తులసికీ భేదం కన్పించటంలేదు నాకు. నువ్వు పుట్టటం నాకు గుర్తు. అక్కయ్య పోవటం కూడా జ్ఞాపకముంది. నువ్వేడుస్తున్నప్పుడల్లా వుయ్యాల వూపేవాణ్ణి. లేకపోతే అమ్మ నిన్ను నా కాళ్ళమీద పడుకోబెట్టి పాలు తీసుకొచ్చేది. కొన్ని విషయాలు మచ్చల్లా గుర్తుండిపోయాయి. అప్పుడు రాఘవులు కూడా నా అంతే వుండేవాడులే. వాడి చెల్లి నీలా చిన్నపిల్ల. వాళ్ళింటి కెళితే 'మా చెల్లి-చెల్లి' అంటూ వీధిలోకి తీసుకొచ్చేవాడు ఎత్తుకొని వాళ్ళ చెల్లెని. అదిచూసి నేనుకూడా నిన్ను చెల్లీ'- అంటూంటే 'కాదురా! పాప, తులసి' అనేది అమ్మ. ఆ నాటి తులసివి నీవు ఈనా డింతయ్యావు. ఎన్నో మార్పులు జరిగాయి కాని నా మనసుకి అదే తులసివి. అమ్మ, నాన్న పోయాడనే బెంగతో నన్ను బస్తీ పంపడానికి ఒప్పుకోకపోతే చదువూ-సంధ్యా లేక నీతో బొమ్మలాటలాడుతూ కూర్చునేవాణ్ణి కదూ? రెండేళ్ళ కెలాగో మనవాళ్ళంతా నచ్చజెప్పి ఏర్పాటుచేశారనుకో. మొదటిసారి నువ్వు పైటలేసుకోడానికి నేనే చీరకొని తెచ్చాను, ఫిఫ్త్‌ఫారం పరీక్షలురాసి వస్తూ, ఇంటర్లో వుండగా ఏదో పండక్కి ఇంటికొస్తే నువ్వు పెద్దదాని వయ్యావు. నేనే తాటితోపులో ఆకులు కొట్టించుకొచ్చాను. నువ్వు చదువుకొనే దారి

లేదని ఎంతో బాధపడ్డాను. నీకు తెలుసుగా? ఐనా అప్పట్నుంచీ మంచి మంచి పుస్తకాలు తెస్తూనే వున్నాను.

మనవాళ్ళు అంతా 'పెళ్ళానికి తెచ్చుకుంటున్నా'డని వేళాకోళా లాడుతారుగాని నా మనసులో అదేం వుండదు. 'తులసికి' అని మాత్రం అనిపిస్తుంది. నిన్ను ఆప్యాయంగా ఆడుతోడుగా చూడాలనిపిస్తుందిగానీ, భార్యగా ఊహించుకుంటే మనసు విలవిల్లాడుతుంది. నువ్వు అందమైన దానివి. కానీ ఏనాడూ నీ అంద చందాలమీదకి నా దృష్టి పోలేదు. నీతో ఒంటరిగా మాట్లాడినా నాలో సంతోషం వుండదు. కాని ఇందిరని ఒంటరిగా పలకరించి, ఏదో సరసమాడాలనిపిస్తుంది. ఏకాంతంకోసం ఎదురు చూస్తుంటాను. ఏమైనా అంటే ఇందిర సిగ్గుతో సతమతమైపోతుంది. ఇష్టం లేనట్టు మందలిస్తుంది. నిన్ను అన్నదీలేదు. దారితప్పి అంటే ఝుమాయించి ఛెళ్ళున జవాబు చెప్తావుగానీ సిగ్గుపడి ఊరుకోవేం? ఏకాంతంగా వున్నప్పుడు కూడా సామాన్యంగా తిరుగుతావు. స్వతంత్రంగా ముట్టుకుంటావు. ఇందిర చెయ్యితగిల్తే నా ఒళ్ళు జల్లుమంటుంది. నీ స్పర్శకి అలా అనిపించ దెందుకని? నా అభిప్రాయాలిలావుంచి నీ సంగతి చూసినా అంతే తులసీ. 'నీ మొగుడే' అని ఎవరో జ్ఞాపకంచేస్తే లాంచన ప్రాయంగా 'పో అత్తా!' అనో, ఏదో అంటావు. మరుక్షణంనుంచే మొగుడనేమాట మర్చిపోతావు. నువ్వు ఆడదానివేకదా! మరి నీకు సిగ్గులేదనుకోవాలా? ఈ వయసులో సహజంగా వుండాల్సిన అనుభూతులు నీకు కల్గటంలేదంటే కారణం? ఒక్కటే తులసీ! నేను నీ మావయ్యని. అదే సత్యం నీ మనసులో నాటుకుపోయి వుంది. చిన్నప్పటినుంచీ చూస్తున్న నేనంటే నీకు చనువు, నిర్లక్ష్యం! సహజంగా నీలో దాగి వుండే స్త్రీ గుణాలు బయటపడాలంటే మరో మగాడుండాలి, నేను తప్ప. ఆ వ్యక్తిని చూస్తే నీకు సిగ్గు ముంచుకొస్తుంది కొత్తకొత్త ఆలోచన లొస్తాయి. మన మనస్సుకి అనుభూతులు కల్గించలేని వ్యక్తిని భర్తగాగానీ, భార్యగా గాని, చేసుకుని ఏం సుఖపడాలి తులసీ?....అసలు వింటున్నావా?" ఆపుచేసి కృష్ణమోహన్ తులసి మొహంలో మార్పులకోసం చూశాడు.

తులసి ముందుకు పడిన జడని వేళ్ళతో రాస్తూ కూర్చుంది మౌనంగా. క్షణం ఆగి అంది-"అయినా నేను బస్తీపిల్లలా లేనని నీ కిష్టం లేదు లెద్దూ? నాకు తెలీదేమిటి?"

"నీ నెత్తి. అర్థంచేసుకుంటావని విడమర్చి చెప్తూంటే తెలీనట్టు నటిస్తావేం? అసలు నేనంటే నీ కెందు కిష్టమో చెప్పు."

తులసి చూపు నేలమీద గుచ్చి అంది-"ఇష్టం ఏమిటి? అమ్మా వాళ్ళంతా అంటారు. మరి లక్ష్మిని వాళ్ళ మేనమామ చేసుకోలేదా?"

"అది వేరు. అతను చిన్నప్పట్నుంచి వేరేచోట పెరిగాడు. ఇంతసేపు చెప్పింది నీ కర్థంకాలేదా? అమ్మా వాళ్ళంటారనేగానీ, నీకు నువ్వు ఏమీ అనుకోవటం లేదన్నమాట. అవునా? మరి నేను పెళ్ళిచేసుకోకపోతే పెళ్ళి చేసుకోవటం మానేస్తావా?"

"దేశం గొడ్డుపోలేదు. నువ్వు చేసుకోకపోతే మానెయ్యటానికి" పౌరుషంగా అంది తులసి గోడకేసి చూస్తూ.

కృష్ణమోహన్ నవ్వాడు.

"నీ మనసంతా నీ మాటల్లో నీ చేతల్లో వ్యక్తమౌతూంది తులసీ! దేశం ఎప్పుడూ గొడ్డుపోదు. నన్ను మించినవాళ్ళు కోట్లు. కానీ ఇందిరైతే నా కోసం మథనపడుతుంది ఎంత గొప్పవాణ్ణయినా నా కంటే తక్కువగా భావిస్తుంది. కాని నీకు నా మీద దెబ్బతీయాలనే కోరికపుట్టింది. మావయ్య దాటిపోతున్నాడనే బాధలేదు. నా కోసం నీకు బాధలేదంటే కారణం తెలుసా? నా మీద నీకు ప్రేమ లేదన్నమాట. నేను దక్కినా ఒకటే; దక్కకపోయినా ఒకటే. మరినీకి కోపం ఎందుకూ మామీద? ఇందిరేం చేసింది మధ్య?" కృష్ణమోహన్ తులసిని చూస్తూ అన్నాడు.

"నిన్ను అన్యాయం చెయ్యను తులసీ! పెద్ద ఉద్యోగస్తుడికిచ్చే పెళ్ళి చేస్తాను. హాయిగా పట్నాల్లో పెద్దహోదాలో వుంటావు. నీ భర్త నీకు దాసుడై పోతాడు. అన్నిసర్దాలూ అనుభవిస్తావు. నీకిది పుట్టిల్లుగావుంటుంది. నీ ఆస్తి నే చూస్తూంటాను. అంతందమైన భవిష్యత్తు సృష్టించుకోవచ్చు తులసీ! దాన్నిబట్టి నా కోరికకూడా తీరి నేనూ హాయిగా వుంటాను. మనలో మనం ముడిపెట్టుకుంటే ఏముంది? ఇద్దరం ఒకేచోట పడివుండాలి. అందం చందం వుండదు. చక్కగా నువ్వు అత్తగారింటి కెళ్ళటం, పుట్టింటికి రావటం, ఇందిర నీకు అత్తయ్య కావటం, ఎంత సందడిగా వుంటుంది మనయిల్లు! ఏం తులసీ! చెప్పుమరి. నీ కెవరుకావాలి? డాక్టరుగారి పెళ్ళానివౌతావా? ప్లీడరుగారి...."

"ఛ! పో మావయ్యా!" తులసి సిగ్గుతో తలవంచుకుని మునిపళ్ళతో

పెదవి నొక్కుకోసాగింది.

"అదే నేనూ అనేది. నన్ను నా ఇందు దగ్గరికి పోనీ! నువ్వు సంతోషంగా ఒప్పుకుంటేగాని నా పెళ్ళి జరగదు. నీకు నచ్చిన వ్యక్తితో ముందు నీ పెళ్ళి జరిపిన తర్వాత, నా పెళ్ళి చేసుకుంటాను. ఏం తులసీ! ఇష్టమేనా? చెప్పుమరి...."

"ఏమో బాబూ! తెలీదు. అమ్మ ఏమంటుందో!"

"మనిద్దరికీ ఒకే అమ్మకదూ తులసీ! అందుకే మనం అన్నా - చెల్లెళ్ళుగా వుండిపోతే హాయిగా వుంటుంది. నువ్వు కష్టపెట్టుకోవని వింటే అమ్మ ఏమీ అనదు. సంతోషంగా ఒప్పుకుంటుంది. నిన్నట్నుంచి నా మీద మండిపడే నీకు ఎవరిమాటో ఎత్తగానే ఎంత శాంతం, ఎంత సిగ్గూ ఆవేశించాయో తెలుసా? నేనే కావాలనిపిస్తే మరో మనిషి సావాసంకోసం మన సెందుకు సర్దాపడుతుంది? సరే! చెప్పవలసిందంతా చెప్పాను. తోడుగా పెరిగిన నిన్ను భార్యగా చూడలేను. పెళ్ళనేది మనసులకి సంబంధించినది తులసీ! కాబోయే భర్తనిగాని, భార్యనిగాని తలుచుకుంటే మధురమైన అనుభూతులు కలగాలి. ఆ మార్పు రానప్పుడు ఆ పెళ్ళే నిరర్థకం. వెళ్ళి పడుకుని జాగ్రత్తగా ఆలోచించు! ఇందిర రేపు వెళ్ళిపోతుంది. తనతో నీకు గొడవ ఏమిటి? రోజులా మాట్లాడు."

తులసి లేచి నుంచుంది.

"గ్లాసు తీసికెళ్ళిపో తులసీ!" కిటికీలో గ్లాసందుకుని నీళ్ళుతాగి గ్లాసిచ్చాడు.

తులసి అందుకుంటూ నవ్వింది—"ఇందాక నిజంగా దాహమయ్యే పిలిచావా? నాతో వాగి వాగి అలిసిపోయే వనుకుంటాను. నీళ్ళింకా కావాలా?"

"వద్దులే. ఈ కాసేపు అలిసినా ఫర్వాలేదు. ఎల్లకాలం సుఖపడతాను ఇక నువ్వెళ్ళు. ఇందిర ఒక్కతే పడుకుని వుంటుంది. దీపం తగ్గించి తలుపు కాస్త దగ్గరికేసి, వెళ్ళు. అన్నట్లు టైం ఎంతైందో చూడు తులసీ!" మంచంమీద కూర్చున్న కృష్ణమోహన్ పక్కదులుపుకుని పడుకుంటూ అన్నాడు. తులసి డ్రాయరు మీదుంచిన వాచీ చూసి "అబ్బా! పది దాటింది మావయ్యా! పడుకో" అంటూ దీపం తగ్గించి తలుపులు దగ్గరికేసి వెళ్ళి పోయింది, మువ్వల పట్టాలు చిన్నగా చప్పుడు చేసుకుంటూ.

* * * *

తెల్లారి కిందకి దిగివచ్చిన ఇందిరకి రోజులా అన్నీ అమర్చి పెట్టింది తులసి. అన్నపూర్ణమ్మ నవ్వుతూ కన్పించింది. తులసిలో మార్పుకి ఇందిర ఆనందించటం కంటే ఎక్కువగా ఆశ్చర్యపోయింది. రోజూకంటే ఎక్కువ సర్దాగా వుంది, ఆ రోజు తులసి సంతోషంగా మాట్లాడింది. బుట్టెడు ముద్ద బంతిపూలు తెచ్చి ముందు పోసింది దంతగుచ్ఛమంటూ.

"నువ్వేమనుకున్నా సరే! ఆ పూలు మాత్రం నే పెట్టుకోను బాబూ!" అంది ఇందిర అయిష్టంగా.

తులసి ఫక్కుమని నవ్వుతూ "నిన్ను పెట్టుకోమంటానని భయపడి పోయేవేమిటి ఇందిరా? ఈ దండలు వీధి గుమ్మాలకి కడదాం. లేకపోతే సాయంత్రం మీరు వెళ్ళేటప్పుడు ఎడ్ల మెడలకి కడతాడు అప్పన్న. మనకి వేరే వున్నాయిగా పూలు?" అంది. ఎక్కడ చూసినా ముద్దబంతిపూలే. ఇందిర వచ్చేసరి కన్నీ మొగ్గలు.

సాయంత్రం ఇందిర ప్రయాణం. మధ్యాహ్నం నుంచే హడావిడీ! కొత్తగా అల్లిన మేదర చాపవేసి, గూడుకట్టి బండిలో ఒత్తుగా గడ్డివేసి, ఈతాకుల చాపవేసి తయారు చేశాడు అప్పన్న బండిని. ఎడ్లుకూడా పది రోజుల్నుంచీ పనిలేక గూడుబండి తయారీ చూసి ప్రయాణం కోసం హుషారుగా ఎదురు చూస్తున్నాయి - పచ్చగడ్డి మేస్తూ.

"టైమవుతోంది తులసీ! ఏమిటీ ఆలస్యం? ఈ బండి దాటితే రాత్రివరకూ బండిలేదు. అప్పన్నని బండి కట్టుకు రమ్మని చెప్పనా?" అన్నాడు కృష్ణమోహన్ చావిట్లో కొస్తూ.

"నాదేం ఆలస్యం లేదు. పెట్టె పైనుంది బండిలో వెయ్యమని చెప్పు తులసీ!" అంటూ మెట్లు దిగి కిందికొచ్చింది ఇందిర.

"తులసీ? అమ్మాయికి బొట్టు పెట్టు" అంది అన్నపూర్ణమ్మ ఏవో వస్తువులు డబ్బాల్లో సర్దుతూ. తులసి గదిలోకి పరుగెత్తి వెండి కుంకుమ బరిణా, ఓ చీర, రవికలగుడ్డా తెచ్చి ఇందిరకి బొట్టుపెట్టి బట్టలు చేతిలో పెట్టబోయింది. ఇందిర మొహమాటంగా- "నాకెందు కిది తులసీ?" అంది. "ఎందుకేవిటి? బియ్యే చదివిన అత్తవి. ఊరికే ఎలా వస్తావు" బొట్టుచెయ్యక తీసుకో అత్తా! లేకపోతే మావయ్యని పిలవాల్సి వస్తుంది" అంటూ చనువుగా ఇందిర చేతులులాగి చీరచేతుల్లో పెట్టింది. ఇందిర సంభ్రమానికీ, సంతోషానికీ పోటీ పడింది, ఏది ఎక్కువో తెలీక. తను విన్న

మాటలూ, చూసే దృశ్యమూ నిజమా? చీర పుచ్చుకోకుండా స్థాణువులా నుంచుండిపోయింది.

"ఏమంటుందేమిటి తులసీ మీ అత్తయ్య? చీర తీసుకోనంటుందా? అది మావయ్య తెచ్చిన చీరని చెప్పు" కృష్ణమోహన్ గుమ్మంలో నుంచుని తులసితో అన్నాడు.

"ఆడవాళ్ళ గొడవ నీ కెందుకుగానీ బండి తోలుకురమ్మను; తీసుకో కేంచేస్తుంది? కట్టుకోవాలికూడా. చీర-గదిలోకి తీసికెళ్ళి కట్టుకో అమ్మాయ్" అంది అధికారికంగా, ఆప్యాయంగా అన్నపూర్ణమ్మ.

సమయానికే అప్పన్న చావిట్లో కొస్తూ "బండిలో చాపవేశాను చాలంటారా? తివాసీకూడా వెయ్యమంటారా?" అన్నాడు.

"ఇంటి కోడలెళ్ళే బండి ఎంత ఆడంబరంగా వుండాలిరా? ఇంకా తివాచీ వెయ్యమంటారా? అని అడుగుతున్నావా? వెధవ్వి" అంటూ తివాచీ తెచ్చియిచ్చింది తులసి.

అప్పన్న అందుకోకుండా నోరు తెరిచి గుడ్లప్పగించి నుంచున్నాడు.

"ఏవిట్రా అలా తెల్లబోతున్నావ్? ఇందిరమ్మగారు మన యింటి కోడలురా? అంటే మీ అబ్బాయి కృష్ణమోహన్‌గారు లేరూ; ఆయనకి కాబోయే పెళ్ళాంరా తెలిసిందా?"— తులసి మావయ్యకీ, ఇందిరకీ విన పడేలా మరీ అరిచింది.

"ఒరే అప్పన్నా! తర్వాత నే చెప్తాను విను. తులసి ఎవరో తెలుసా? పట్నంలో నల్లగా కాకిలాంటి డాక్టరున్నాళ్ళే! వాడి పెళ్ళాం.... సరేగాని తులసీ! మీ అత్త బొమ్మలా నిలబడిపోయింది. కాస్త ఆ చీర కట్టుకుంటుందో లేదో, అసలీ ఇంట్లోంచి కదుల్తుందో లేదో అడుగు, టైమైపోతున్నది."

"బస్తీపిల్ల కింత సిగ్గేమిటి మావయ్యా?" నవ్వింది తులసి.

"బస్తీమీద నీకు చాలా దురభిప్రాయాలున్నాయి తులసీ! అన్నీ పోతాయిలే. మీ డాక్టరుగారి దగ్గర నీ వేషమంతా మారిపోతుంది సుమా! మువ్వలపట్టాలూ, జడగంటలూ- పొట్టి పరికిణీలూ, పాత చంద్ర హారాలూ, అన్నీ మూలపడుకుంటాయి. చేతికి వాచీ- కాళ్ళకి బూట్లూ - ధగ ధగలాడే రాళ్ళ నెక్లెసూ- వుల్లిపొరలాంటి సిల్కు చీరలూ, ఏం?" తులసితో వాదమేసు కొంటుండగా ఇందిర చీర కట్టుకొచ్చింది. లేత నీలం

జరీ చీర! రంగురంగుల చంద్రకాంతలమాల! నిండుగా వుంది ఇందిర. కృష్ణమోహన్‌ని చూసి చూపు మరల్చుకుంది. "బండిలో నీ పని! అన్నట్టుంది కృష్ణమోహన్ చూపు. నీటుగా ముస్తాబై వున్నాడు. ఇందిర విప్పి మడతపెట్టి వుంచిన చీరా, రవికెల గుడ్డా పెట్లో పెట్టింది తులసి. అప్పన్న ఏవో డబ్బాలు రెండు బండిలో వెయ్యడానికి తీసికెళ్ళాడు - "మా వంటలు మీ అమ్మగారూ వాళ్ళూ రుచి చూస్తారు. పంచదారగవ్వలూ! అరిసెలూ! కాసిన్ని అటుకులుకూడా వున్నాయిలే అత్తా! పాలలో నాన వేసుకోండి. వెళ్ళిపోయేటప్పుడు కాస్త ఏమైనా మాట్లాడుదూ!" అంది తులసి.

"నువ్వోసారి మా యింటికి రా!" అంది ఇందిర నవ్వుతూ.

"ఓ! ఎలాగూ వస్తాం పెళ్ళికి."

"టైమైపోతూందని నే మొత్తుకోటమే గాని వినిపించుకోరు గదా ఈ ఆడంగులు" కృష్ణమోహన్ విసుక్కున్నాడు.

"టైముగాదు- ఏమీగాదు. బండిలో కబుర్లు చెప్పుకోవచ్చుని. నాకు తెలీదేమిటి?" నవ్వింది తులసి

"వెళతానండీ!" అంది ఇందిర, అన్నపూర్ణమ్మతో నేలచూపులు చూస్తూ.

"మంచిది. వెళ్ళిరా! మీవాళ్ళ నందర్నీ అడిగానని చెప్పు."నవ్వింది అన్నపూర్ణమ్మ. వీధిలో కెళ్ళింది తులసి వెనకే "వెళతా తులసీ!" అంటూ ఎత్తుపీట మీదనుంచి బండిలోకెక్కి తివాచీ మీద కూర్చుంది.

"మంచిది అత్తా! మామయ్యని తొందరగా పంపెయ్యి."

"నల్లటి డాక్టరుగారి ఫోటో తీసుకొస్తాను. ఎదురు చూస్తుండు." అన్నాడు తొట్లోకూర్చుంటూ కృష్ణమోహన్. అప్పన్న ముందుసాగేసరికి ఎడ్లు మువ్వలు మ్రోగించుకుంటూ నడవ సాగాయి.

తులసి ఇందిరని చూస్తూ ఆలోచిస్తూ నించుంది. "డాక్టర్! ఎలా వుంటాడో! పట్నంలో బంగళా! కార్లో షికారూ! వాచీ పెట్టుకుని....ఓ...."

"ఇందిరెళ్ళిపోతే బోసిపోయింది ఇల్లు! ఎంత కుదురైనపిల్ల! కష్ణ ఎప్పుడూ బుద్ధిమంతుడే. బండి వెళ్ళేపోయింది. నడు లోపలికి. ఏం

చూస్తావ్?" అంది అన్నపూర్ణమ్మ లోపలికెడుతూ. తులసి ఆలోచిస్తూనే నడిచింది లోపలికి.

★ ★ ★ ★

"ఇందూ!" లాలనగా పిలిచాడు కృష్ణమోహన్ బండిలో.

"ఎందుకూ?" నవ్వింది ఇందు.

★